

నేటి దర్శిని తెలుగు దిన పత్రిక లో
ప్రకటనల కోసం సంప్రదించగలరు.
సెల్ : 94920 33365



# నేటి దర్శిని

WWW.NETIDARSHINI.COM

RNI NO: TGTEL/25/A0471

తెలుగు దిన పత్రిక

సత్య శోధనే మా లక్ష్యం...





Contact Number
9059328777



రంగారెడ్డి గురువారం 12-03-2026 సంపుటి: 01 సంచిక : 267 వేల: 2 రూ పేజీలు :08 సంపాదకులు: కట్ట హిమ పావని

Ranga Reddy Thursday, 12-03-2026 Volume :01 Issue: 267 Cost: 2 Pages:08 Editor : Katta HimaPavani




## పశ్చిమాసియా యుద్ధంపై

# రాజకీయాలా

**కాంగ్రెస్, కమ్యూనిస్టుల తీరుపై మండిపడ్డ ప్రధాని**

- గల్ఫ్‌లో చిక్కున్న వారిని ఇండియాకు తీసుకుని వస్తున్నాం
- అక్కడి ప్రభుత్వాలు భారత్‌కు అండగా నిలిచాయి
- రాహుల్‌కు అభివృద్ధి గురించి తెలియదు
- విమర్శించడమే రాహుల్‌కు తెలిసిన పని
- కేరళం పర్యటనలో మోడీ గాటు విమర్శలు

తిరువనంతపురం,

ప్రతిపక్ష కాంగ్రెస్ పార్టీతోపాటు ఆ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీపై ప్రధాని నరేంద్ర మోదీ విమర్శలు సంధించారు. లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ బాధ్యతా రహితంగా మాట్లాడుతున్నారని ప్రధాని మోదీ మండిపడ్డారు. దేశ యువతపై ఆయనకు అవగాహన లేదంటూ రాహుల్ తీరును ఎండగట్టారు. కాంగ్రెస్ యువరాజుకి ఏమీ తెలీదంటూ ఆయనపై పరోక్ష విమర్శలు చేశారు. దేశ అభివృద్ధిని కాంగ్రెస్ యువరాజు చూడలేక పోతున్నారంటూ రాహుల్ తీరుపై మండిపడ్డారు. బుధవారం కేరళంలోని ఎర్నాకులంలో ప్రధాని మోదీ పర్యటించారు.

-మిగతా 2 లో

- నారాయణఖేడ్‌లో అక్రమ వెంచర్ల రియల్ మాఫియా బహిర్గతం
- అనుమతులు లేకుండా లేఅవుట్లు వేసి కోట్లలో అక్రమ దందా
- ఎకరం రూ.5--10 లక్షలకు కొనుగోలు... ప్లాట్లు రూ.40--60 లక్షలకు అమ్మకాలు
- బ్రోచర్లు, నేషనల్ హైవే పేరుతో అమాయకుల మోసం
- సంగారెడ్డి జిల్లాలో 40కి పైగా అక్రమ వెంచర్లు
- సీఆర్‌ఆర్, వీజేఆర్, లోటస్ వంటి సంస్థలపై ఆరోపణలు
- కోర్టు కేసుల్లో చిక్కుకుని నష్టపోయిన కొనుగోలుదారులు
- అసైన్డ్ భూములపై రోడ్లు వేసిన హరితవనం ఇన్ఫ్రా!
- డబుల్ రిజిస్ట్రేషన్లతో బాధితుల ఆవేదన
- 10 శాతం రిజర్వ్ స్థలాలు మాయం చేసిన వెంచర్ యజమానులు
- అక్రమ లేఅవుట్లపై చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌కు ఫిర్యాదుల వెల్లువ


# ఒక్క గజానికే... పట్టా పాస్ బుక్..!

**నమ్మి కొంటే నట్టేట్లో మునిగినట్లే..!**

నారాయణఖేడ్, మార్చి11 (నేటి దర్శిని)

సంగారెడ్డి జిల్లా నారాయణఖేడ్ నియోజకవర్గంలో అక్రమ రియల్ ఎస్టేట్ దందా రోజురోజుకూ విస్తరిస్తోంది. ప్రభుత్వ అనుమతులు తీసుకోకుండా వ్యవసాయ భూములను కొనుగోలు చేసి లేఅవుట్లు వేసి ప్లాట్లుగా విక్రయిస్తూ అమాయక ప్రజలను మోసం చేస్తున్న ఘటనలు వెలుగులోకి వస్తున్నాయి. నమ్మి ప్లాట్లు కొనుగోలు చేసిన వారు చివరకు నట్టేట్లో మునిగినట్లుగా మోసపోతున్నామని బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రాంతంలో ఎకరం భూమిని రూ.5 లక్షల నుంచి రూ.10 లక్షల వరకు కొనుగోలు చేసి అదే భూమిని వెంచర్లుగా విభజించి ప్లాట్లను రూ.40 లక్షల నుంచి రూ.60 లక్షల వరకు అమ్ముతున్నట్లు ఆరోపణలు ఉన్నాయి.

-మిగతా 2 లో








## లోక్‌సభలో స్పీకర్‌పై

# వీగిన అవిశ్వాసం

- మూజువాణి ఓటుతో తిరస్కరించిన సభ
- రెండ్రోజుల పాటు సభలో సుదర్ఘంగా చర్చ
- విపక్షాల తీరుపై మండిపడ్డ అమిత్ షా
- స్పీకర్‌ను అవమానించడం తగదని కాంగ్రెస్‌కు హితవు
- ఓటింగ్ అనంతరం సభ నేటికి వాయిదా

న్యూఢిల్లీ,

లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లాపై విపక్షాలు ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మానం మూజువాణి ఓటుతో బుధవారంనాడు వీగిపోయింది. విపక్ష ఎంపీల మద్దతుతో కాంగ్రెస్ పార్టీ ఎంపీ మహమ్మద్ జావేద్ ఈ తీర్మానాన్ని తొలి దఫా పార్లమెంటు బడ్జెట్ సమావేశాల్లో ప్రవేశపెట్టగా, రెండో దఫా బడ్జెట్ సమావేశాల్లో దీనిపై చర్చను ప్యానల్ స్పీకర్ జగదంబిక పాల్ చేపట్టారు. రాహుల్ గాంధీ, అమిత్‌షా, రవిశంకర్ ప్రసాద్ తదితరులు చర్చలో పాల్గొన్నారు. అనంతరం ఓటింగ్ చేపట్టగా... మూజువాణి ఓటుతో ప్రతిపక్షాల తీర్మానం వీగిపోయింది. ఆ వెంటనే లోక్‌సభను ప్యానెల్ స్పీకర్ గురువారంనాటికి వాయిదా వేశారు. స్పీకర్ సభలో పక్షపాతంతో వ్యవహరిస్తున్నారని

-మిగతా 2 లో

## ట్రాఫిక్ ఫ్రీ నగరంగా

# హైదరాబాద్

**తెలంగాణ రూపురేఖలు మార్చేలా రవాణా, వైద్యరంగం అభివృద్ధి**

- 'రోడ్ సెక్టార్ పాలసీ-2047' లక్ష్యంగా కీలక ఆదేశాలు
- అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా రవాణా వ్యవస్థ
- హైదరాబాద్ నుంచి రోడ్డు కనెక్టివిటీ పెంచాలి
- రోడ్ల విస్తరణ పనులు త్వరగా చేపట్టాలి
- రాష్ట్రంలోని ప్రధాన జిల్లా కేంద్రాలన్నింటికీ ఒక రింగ్ రోడ్డు
- నిర్మాణంలో ఉన్న ఆస్పత్రులను త్వరగా పూర్తి
- అధికారులతో సమీక్షలో సిఎం రేవంత్ ఆదేశం



హైదరాబాద్

తెలంగాణ రాష్ట్ర రూపురేఖలను మార్చే విధంగా, భవిష్యత్తు అవసరాలకు అనుగుణంగా రవాణా, వైద్య రంగాల్లో భారీ మార్పులకు సీఎం రేవంత్ రెడ్డి శ్రీకారం చుట్టారు. అధికారులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో 'రోడ్ సెక్టార్ పాలసీ-2047' లక్ష్యంగా కీలక ఆదేశాలు జారీ చేశారు. రాష్ట్రంలో రవాణా వ్యవస్థను అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా తీర్చిదిద్దాలని సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. హైదరాబాద్ నగరం నుంచి రాష్ట్రంలోని ఏ ప్రాంతానికైనా నిర్ణీత సమయంలో చేరుకునేలా రోడ్ల నెట్ వర్క్ ను అభివృద్ధి చేయాలని అన్నారు.

-మిగతా 2 లో






## ఎమ్మెల్యేలకు

# స్పీకర్ క్లీన్‌చిట్

- దానం నాగేందర్, కడియం శ్రీహరిలపై అనర్హత పిటిషన్లు కొట్టివేత.
- సుప్రీంకోర్టు గడువుకు ముందే తుది నిర్ణయం వెల్లడించిన స్పీకర్ గడ్డం ప్రసాద్.
- మొత్తం 10 మంది ఎమ్మెల్యేలకూ ఊరట; ఫిరాయింపుల వివాదానికి తెర.
- 'నా ప్రాథమిక హక్కులను కాలరాయలేరు": స్పీకర్ తీర్పుపై దానం నాగేందర్ హర్షం.
- సుప్రీంకోర్టులో విచారణ ఉండగానే క్లియర్ అయిన అడ్డంకులు.

హైదరాబాద్

తెలంగాణ రాజకీయాల్లో కొంతకాలంగా సాగుతున్న ఉత్కంఠకు తెరపడింది. ఎమ్మెల్యేలు దానం నాగేందర్, కడియం శ్రీహరిలపై దాఖలైన అనర్హత పిటిషన్లపై స్పీకర్ బుధవారం తుది నిర్ణయాన్ని ప్రకటించారు. విచారణ అనంతరం కడియం, దానం నాగేందర్‌కు ఊరట లభించింది. ఎమ్మెల్యేలపై అనర్హత పిటిషన్లను స్పీకర్ గడ్డం ప్రసాద్ డిస్మిస్ చేశారు. దానం, కడియంపై దాఖలపై అనర్హత పిటిషన్లను స్పీకర్ కొట్టివేశారు. సుప్రీంకోర్టు ఆదేశాల నేపథ్యంలో, నిర్ణీత గడువు ముగుస్తుండటంతో స్పీకర్ కార్యాలయం ఈ మేరకు నిర్ణయం తీసుకుంది. మొత్తం పదిమంది ఎమ్మెల్యేల్లో ఇప్పటికే ఎనిమిది మందికి స్పీకర్ క్లీన్‌చిట్ ఇచ్చారు. దానం, కడియంలపై తాజాగా వాదనలు పూర్తికాగా.. నిర్ణయాన్ని ప్రకటించారు. మొత్తం పది మంది ఎమ్మెల్యేలకు క్లీన్ చిట్ లభించింది.

-మిగతా 2 లో



## ఐపిఎల్ 2026

# షెడ్యూల్ విడుదల

**28న బెంగళూరు, హైదరాబాద్ మధ్య తొలిపోరు**

ముంబయి:

ఇండియన్ ప్రీమియర్ లీగ్(ఐపిఎల్) సీజన్ 2026 షెడ్యూల్ విడుదలైంది. భారత క్రికెట్ కంట్రోల్ బోర్డు(బిసిసిఐ) బుధవారం 2026 ఐపిఎల్ షెడ్యూల్‌ను విడుదల చేసింది. బెంగళూరులోని చిన్నస్వామి స్టేడియంలో ఈ నెల 28 నుంచి టోర్నీ ప్రారంభం కానుంది. ప్రారంభ వేడుకల అనంతరం జరిగే తొలి మ్యాచ్‌లో.. గత ఏడాది విజేత బెంగళూరు(ఆర్సీబీ) జట్టు, హైదరాబాద్(ఎస్ఆర్‌హెచ్) జట్టు తలపడనున్నాయి. 29న ముంబయి-కోల్‌కతా జట్ల మధ్య రెండో మ్యాచ్, మూడో మ్యాచ్ రాజస్థాన్, చెన్నై మధ్య ఈ నెల 30న జరగనున్నాయి. తొలి మ్యాచ్ జరిగే బెంగళూరు చిన్నస్వామి స్టేడియానికి సంబంధించి క్లియరెన్స్ సర్టిఫికెట్ రావాల్సి ఉంది. ఈ నెల 13న దీనిపై నిర్ణయం వెలువడుతుంది. సానుకూల నిర్ణయం వస్తేనే ఇక్కడ మ్యాచులు జరుగుతాయి. లేకుంటే ఓపెనింగ్ మ్యాచ్ సహా ఇతర మ్యాచులన్నీ మరో వేదికకు మారతాయి. గత ఏడాది ఆర్సీబీ విజయోత్సవ వేడుకల సందర్భంగా

-మిగతా 2 లో

# ఆస్కార్ వేడుకకు రంగం సిద్ధం

- 15న సాయంత్రం ప్రత్యక్ష ప్రసారం

లాస్

ప్రపంచ సినీ ప్రియులంతా ఎంతో ఆసక్తిగా ఎదురుచూసే అతి పెద్ద వేడుక 'ఆస్కార్స్ 2026' 98వ అకాడమీ అవార్డ్స్ కు సర్వం సిద్ధమైంది. 2025లో విడుదలైన ఉత్తమ చిత్రాలు, నటీనటులు, సాంకేతిక నిపుణులకు పురస్కారాలు అందించేందుకు లాస్ ఏంజెల్స్ లోని డాల్బీ థియేటర్ సర్వాంగ సుందరంగా ముస్తాబైంది. అగశ్రేణి హాలీవుడ్ తారలు, ప్రతిభావంతులైన దర్శకులు, నిర్మాతలు ఒకే వేదికపై సందడి చేయనున్నారు. ఈ ఏడాది ఆస్కార్ వేదికపై భారతీయ నటి ప్రియాంక చోప్రా కూడా ప్రెజెంటర్‌గా వ్యవహరించనున్నారు. రాబర్ట్ డౌనీ జూనియర్, అన్నే హాత్‌వే, గ్వినేత్ పాల్ట్రో, పాల్ మెస్కల్ వంటి ప్రముఖ స్టార్స్‌తో కలసి ఆమె వేదికపై అవార్డులను ప్రదానం చేయనున్నారు.98వ అకాడమీ అవార్డ్స్ ఈనెల 15న ఆదివారం అమెరికా కాలమానం ప్రకారం సాయంత్రం 7 గంటలకు లాస్ ఏంజెల్స్‌లోని ప్రఖ్యాత డాల్బీ థియేటర్‌లో అట్టహాసంగా జరగనున్నాయి. కాల వ్యత్యాసం కారణంగా భారతదేశంలో



-మిగతా 2 లో

# తెలంగాణ గవర్నర్‌గా శివప్రతాప్ శుక్లా

- రాజ్‌భవన్‌లో తెలుగులో ప్రమాణం
- సిఎం రేవంత్ తదితరుల హాజరు

హైదరాబాద్

తెలంగాణ నూతన గవర్నర్‌గా శివప్రతాప్ శుక్లా ప్రమాణ స్వీకారం చేశారు.. తెలుగులో ప్రమాణం చేయడం ఆసక్తిగా మారింది. లోక్‌భవన్‌లో హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి ప్రమాణస్వీకారం చేయించారు. ఈ కార్యక్రమానికి స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్,

-మిగతా 2 లో



# ఎమ్మెల్యేలకు స్పీకర్ క్లీన్‌చిట్

(మొదటి తరువాయి)

సుప్రీంకోర్టు సూచనల ప్రకారం మార్చి 12వ తేదీలోపు వీరిద్దరి విషయంలో స్పీకర్ నిర్ణయాన్ని ప్రకటించాల్సి ఉండగా.. ఒకరోజు ముందే.. స్పీకర్ కడియం, దానం నాగేందర్ పై దాఖలైన రెండు పిటిషన్లను డిస్మిస్ శారు.

**దానం నాగేందర్ కీలక వ్యాఖ్యలు..**

స్పీకర్ తీర్పు తర్వాత దానం నాగేందర్ కీలక వ్యాఖ్యలు చేశారు. తాను ఎలాంటి తప్పు చేయలేదని.. వ్యక్తిగత నిర్ణయంతోనే కాంగ్రెస్ నుంచి ఎంపీగా పోటీ చేశానని దానం నాగేందర్ పేర్కొన్నారు. తన ఫండమెంటల్ రైట్‌ను కాలరాసే హక్కు ఎవరికీ లేదని.. ఆరు నెలలుగా క్షోభను అనుభవించానన్నారు. స్పీకర్‌ని కూడా ఆరు నెలలుగా ఇబ్బంది పెడుతూ వచ్చారని.. దానం పేర్కొన్నారు.

ఖైరతాబాద్ నుంచి బీఆర్ఎస్ అభ్యర్థిగా విజయం సాధించిన కాంగ్రెస్‌లో చేరిన దానం నాగేందర్‌పై అనర్హత వేటు వేయాలని బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి, బీజేపీ ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డిలు పిటిషన్ వేశారు. స్టేషన్ ఘన్‌పూర్ నుంచి కారు గుర్తుతో పోటీచేసిన కడియం శ్రీహరి..కాంగ్రెస్‌లో చేరడాన్ని ప్రశ్నిస్తూ కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కేపీ వివేకానంద గౌడ్ అనర్హత పిటిషన్ ఫైల్ చేశారు. ఎమ్మెల్యేల అనర్హత పిటిషనపై సుప్రీంకోర్టులో రేపు విచారణ జరుగనుంది. దాంతో.. అంతకంటే ముందే స్పీకర్ తన తీర్పును వెల్లడించారు.

# లోక్‌సభలో స్పీకర్‌పై వీగిన అవిశ్వాసం




ఆరోపిస్తూ విపక్ష సభ్యులు పెట్టిన అవిశ్వాస తీర్మానంపై మంగళవారం నుంచి బుధవారం వరకు సుదీర్ఘంగా చర్చ జరిగింది. ఈ చర్చలో విపక్షాలు చేసిన విమర్శలకు కేంద్ర హోంమంత్రి అమిత్ షా సమాధానం ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన కాంగ్రెస్‌పై మండిపడ్డారు. స్పీకర్ అంకితభావాన్ని విపక్షాలు ప్రశ్నిస్తున్నాయి. ప్రతిపక్షాలు నిబంధనలు ఉల్లంఘిస్తేనే స్పీకర్ రంగంలోకి దిగారు. పార్లమెంటు నిబంధనలు నెహ్రూ హయాంలోనే రూపొందించారు. కాంగ్రెస్ రూపొందించిన నిబంధనలపై చర్చకు సిద్ధం. పార్టీలకు అతీతంగా స్పీకర్ వ్యవహరిస్తారు. లోక్‌సభ నిబంధనల ప్రకారం స్పీకర్‌దే తుది నిర్ణయం. భారత ప్రజాస్వామ్యాన్ని విపక్షాలు ప్రశ్నిస్తున్నాయి. స్పీకర్ ఉద్దేశాలను ఎవరూ తప్పు పట్టాల్సిన అవసరంలేదని అమిత్ షా అన్నారు. స్పీకర్ విధేయతను అనుమానించడం దురదృష్టకరం. స్పీకర్ స్థానం దిశగా ప్రతిపక్షసభ్యులు పేపర్లు విసిరారు. అందరూ లోక్‌సభ నిబంధనలు పాటించాలి. సభలో ఎలా మాట్లాడాలో థరూర్ నేర్పించాలి. కాంగ్రెస్ నేతలకు థరూర్ ఎందుకు హిత బోధ చేయరని అన్నారు. కాంగ్రెస్ నిబంధనలు పార్లమెంటును నడపజాలవు. తప్పులు సరిదిద్దుకొనేందుకు ప్రతిపక్షాలకు అవకాశం వచ్చిందని అమిత్ షా అన్నారు. దాదాపు 40 ఏళ్ల సుదీర్ఘ విరామం తర్వాత ఒక స్పీకర్ పై ఇలాంటి తీర్మానం రావడం దురదృష్టకరమని, ఇది పార్లమెంటరీ సంప్రదాయాలను కించపరచడమే అని ఆయన పేర్కొన్నారు. స్పీకర్ స్థానాన్ని రాజకీయ కోణంలో చూడటం తగదని అమిత్ షా స్పష్టం చేశారు. 'స్పీకర్ పదవికి రాజకీయాలతో సంబంధం లేదు. సభలో ఆయన అందరివాడు, అన్ని పార్టీల ఏకాభిప్రాయంతోనే స్పీకర్ ఎంపిక జరిగింది. అటువంటి వ్యక్తి నిబద్ధతను, నిష్పక్షపాత వైఖరిని ప్రశ్నించాల్సిన అవసరం లేదు' అని ఆయన వ్యాఖ్యానించారు. సభా నిబంధనలను కాంగ్రెస్ పార్టీ పదే పదే ఉల్లంఘిస్తోందని అమిత్ షా ఆరోపించారు. ఈ సందర్భంగా ఆయన గత చరిత్రను గుర్తు చేస్తూ కీలక వ్యాఖ్యలు చేశారు. 'ప్రస్తుతం సభలో అమలవుతోన్న నిబంధనలు నెహ్రూ కాలంలో రూపొందబడ్డాయి, వాటిని గౌరవించాల్సిన బాధ్యత అందరిపై ఉంది. సభా మర్యాదలను కాపాడటంతో ప్రతిపక్షాలు విఫలమవుతున్నాయి, నిబంధనలను పాటించకుండా స్పీకర్ పై తప్పుడు ఆరోపణలు చేయడం సరికాదని అన్నారు.

# ఐపిఎల్ 2026 షెడ్యూల్ విడుదల

(మొదటి తరువాయి)

జరిగిన తొక్కిసలాటలో పలువురు మరణించిన సంగతి తెలిసిందే. అందుకే ఈ స్టేడియంలో మళ్లీ మ్యాచుల నిర్వహణకు ప్రభుత్వం అనుమతి రావాల్సి ఉంది. ఈ సీజన్‌కు సంబంధించి ప్రస్తుతానికి ఏప్రిల్ 12 వరకు జరిగే మ్యాచుల షెడ్యూల్ మాత్రమే విడుదలైంది. ఈ ఏడాది పలు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలు ఉన్న నేపథ్యంలో మ్యాచుల నిర్వహణ విషయంలో భద్రతాపరమైన సమస్యల కారణంగా బిసిసిఐ వేదికలను పూర్తిగా ఖరారు చేయలేదు.

# ఆస్కార్ వేడుకకు రంగం సిద్ధం

(మొదటి తరువాయి)

ఈ వేడుకలను మార్చి 16 సోమవారం వేకువ ఝామున 4:30 గంటల నుంచి వీక్షించవచ్చు. తారల తళుకులతో రెడ్ కార్పెట్ ఈవెంట్ ప్రారంభమవుతుంది. ఆ తర్వాత అవార్డుల ప్రదానోత్సవం మొదలవుతుంది. ప్రముఖ హాస్యనటుడు, టెలివిజన్ వ్యాఖ్యాత కోనన్ ఓబ్రియన్ వరుసగా రెండో ఏడాది కూడా ఈ వేడుకలకు వ్యాఖ్యాతగా వ్యవహరిస్తున్నారు. భారతీయ ప్రేక్షకులు ఆస్కార్స్ వేడుకలను డిజిటల్, టెలివిజన్ ప్లాట్‌ఫామ్‌లలో వీక్షించవచ్చు. స్టార్ మూవీస్‌లో ఉదయం 4:30 గంటల నుంచి ప్రత్యక్ష ప్రసారం అవుతుంది. ఉదయం చూడలేని వారి కోసం అదే రోజు రాత్రి ఈ వేడుకను పునః ప్రసారం చేయనున్నారు. అలాగే జియో హాట్‌స్టార్ యాప్‌లోనూ ప్రత్యక్ష ప్రసారం అవుతుంది.

## తెలంగాణ గవర్నర్‌గా శివప్రతాప్ శుక్లా




మండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, సీఎం రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి, మంత్రులు హాజరయ్యారు. ముందుగా పూర్తి వందేమాతరం గేయంతో కార్యక్రమం ప్రారంభమైంది. అనంతరం మంత్రులతో కలసి గవర్నర్ గ్రూప్ ఫోటో దిగారు. ఇక శివ్ ప్రతాప్ శుక్లా విషయానికి వస్తే.. ఆయన 73 ఏళ్ల సుదీర్ఘ రాజకీయ నేపథ్యం కలిగిన నేత. ఉత్తరప్రదేశ్‌కు చెందిన ఆయన, ఏబీవీపీ ద్వారా రాజకీయాల్లోకి ఎంట్రీ ఇచ్చారు. ఎమర్జెన్సీ సమయంలో జైలుకు సైతం వెళ్లారు. యూపీలో నాలుగుసార్లు ఎమ్మెల్యేగా, కేబినెట్ మంత్రిగా, కేంద్ర ఆర్థిక శాఖ సహాయ మంత్రిగా పనిచేశారు. 2023-2026 మధ్య హిమాచల్ ప్రదేశ్ గవర్నర్‌గా బాధ్యతలు నిర్వర్తించారు. తాజాగా తెలంగాణకు విచ్చేశారు.


# ఒక్క గజానికే..పట్టా పాస్ బుక్...!

(మొదటి తరువాయి)

బ్రోచర్లు, ఆకర్షణీయ ప్రకటనలు, నేషనల్ హైవేలు, ఫార్మ్ హౌస్ అవకాశాల పేరుతో అమాయకులను ఆకట్టుకుని రియల్ ఎస్టేట్ మాఫియా కోట్ల రూపాయలు వసూలు చేస్తున్నట్లు తెలుస్తోంది. సంగారెడ్డి జిల్లాలోని నారాయణఖేడ్, కంది, సిర్గాపూర్, గట్టు లింగంపల్లి, మనూర్, నాగల్ గిద్ద మండలాల్లో 40కి పైగా అక్రమ వెంచర్లు ఏర్పాటు చేసి సిండికేట్‌గా పని చేస్తున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. సీఆర్ఆర్ ఇన్ఫ్రా డెవలప్మెంట్, వీజేఆర్ ఇన్ఫ్రా, లోటస్ ఇన్ఫ్రా, హరితవనం ఇన్ఫ్రా, భారత్ నిర్మాన్ వంటి సంస్థలు అనుమతులు లేకుండానే వెంచర్లు ఏర్పాటు చేసి ప్లాట్లను విక్రయిస్తున్నట్లు స్థానికులు ఆరోపిస్తున్నారు. కొన్ని వెంచర్లలో కోర్టు కేసులు కొనసాగుతున్నప్పటికీ కొనుగోలుదారులకు వివరాలు తెలియకుండా ప్లాట్లు అమ్మిన ఘటనలు బయటపడుతున్నాయి. కొన్ని చోట్ల డబుల్ రిజిస్ట్రేషన్లు జరిగినట్లు కూడా బాధితులు చెబుతున్నారు. అలాగే వెంచర్‌కు దారి లేకపోయినా అసైన్డ్ భూములను ఆక్రమించి రోడ్లు వేసిన ఘటనలు కూడా వెలుగులోకి వచ్చాయి. నిబంధనల ప్రకారం వెంచర్ విస్తీర్ణంలో 10 శాతం భూమిని ప్రజాప్రయోజనాల కోసం కేటాయించాలి. అయితే ఈ రిజర్వ్ స్థలాలను కూడా



చూపించి తరువాత అక్రమంగా రిజిస్ట్రేషన్ చేసి అమ్మేస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. దీంతో పంచాయతీలకు రావాల్సిన కోట్ల రూపాయల ఆస్తి కూడా నష్టపోతున్నట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలో సంగారెడ్డి జిల్లాలో జరుగుతున్న అక్రమ వెంచర్లపై వెంటనే చర్యలు తీసుకోవాలని తెలంగాణ బతుకమ్మ పార్టీ వ్యవస్థాపక



TELANGANA ASSIGNED LAND OWNERS WELFARE ASSOCIATION
Regd. No. 288 of 2022
# 8-4-315/21/86, Chatrapathi,Shivaji Nagar,Erragadda Ameerpet
Hyderabad-501 018. Telangana, India.

Chief Advisor Dr.Gali Vinod Kumar D6 MD-D JAC C HAIRMAN | Chief Advisor Dr.J.B. Raju U.S.(Retd) National Chairman-Dalit Sena | Advisor Lingala Sudheer Advocate,LLB.,LLM | Advisor D.Sudarshan Babu State President,SCRPS,TS.

Date: 02/03/2026

శ్రీయుత గౌరవనీయులైన కలెక్టర్ సంగారెడ్డి జిల్లా గారికి నమస్కరించి వ్రాయునది ఏమనగా!

విషయము:- అక్రమంగా ఎటువంటి ప్రభుత్వ అనుమతి లేకుండా గుంటలు, గజాలుగా అక్రమ వెంచర్ చేసి క్రయవిక్రయాలు నిర్వహిస్తుండగా దీనిపై DPO గారికి ఫిర్యాదు చేయగా వారు పూర్తిగా నిర్లక్ష్యంగా మరియు ఏకపక్షంగాఫిర్యాదుదారులమైన మా నుండి ఎటువంటి సాక్షాలు తెలుసుకోకుండా రిపోర్ట్ ఇవ్వడం జరిగింది. దీనిపై కలెక్టర్ గారైన మీరు పూర్తిగా పరిశీలించి ఇరు పక్షాల నుండి వాస్తవ్యాలను, అవాస్తవాలను పరిశీలించి ప్రత్యేక ఆఫీసర్ తో చర్చ hearing చేపట్టుట గురించి

ఆర్యా


నేను అనగా కందాడి మణిపాల్ రెడ్డి S/o నర్సిరెడ్డి R/o ఉప్పల్ హైదరాబాద్ నేను 04th Sep 2024 న DPO సంగారెడ్డి గారికి Sampi Bioform,Capital Sampangi Treasurer Vally, Sampangi Dates Palm Vally, Lotus Reality and Agro forming ,Sahasra అను అక్రమ వెంచర్ లపై అన్ని రిపోర్టుల ఆధారంగా ఫిర్యాదు 04/06/2024 న చేసియుంటిని.Sampangi Boiform వారు Narayankhed division లోని Mannur Mandal,Gatlingampally Village లో Dates Palm Vally పేరుతో మరియు Sirgapur Mandal, Wasar, Potpally Villages లలో Sampangi Treasurer Valley అను పేరుతో పెద్ద ఎత్తున భూ కుంభకోణం చేస్తూ, ప్రభుత్వమునకు రావలసిన ఆదాయానికి గండి కొడుతున్నారు. మరియు ప్రభుత్వ నిబంధనలు అయిన DTCP, RERA, PERMISSIONS తీసుకోక పోవడం వల్ల గ్రామపంచాయతీకి ఇవ్వవలసిన Gift Mortgages ఎగగొట్టడం జరుగుతుంది. ఇక అందులో కొనే కస్టమర్స్ కి ఏవేవో మోసపూరిత మాటలతో, వాగ్దానాలతో గుంటలు, గజాలు అనగా పూర్తిగా ప్రభుత్వ విధానాలకు విరుద్ధంగా Regestrations చేయడం చాలా వింతగా ఉంది. గుంటలు, గజాలు చేసిన వాటిని కూడా ప్రభుత్వ పథకాలైన రైతుబంధు, రైతు బీమా, సెంట్రల్ గవర్నమెంట్ స్కీంలు కూడా వర్తిస్తున్నాయంటే అధికారులు చూస్తు ఏం చేస్తున్నారు?.MPO గారికి RTI ఇచ్చి Complete Information తెప్పించాం. AO గారికి RTI ఇచ్చి రైతుబంధు ఎంతమందికి ఇందులో కొన్నవారికి వస్తుందో వివరంగా వారి

అధ్యక్షుడు కందాడి మణిపాల్ రెడ్డి జిల్లా కలెక్టర్ పి.ప్రావిణ్యకు ఫిర్యాదు చేశారు. అనుమతులు లేకుండా ఫామ్‌ల్యాండ్ లేఅవుట్లు ఏర్పాటు చేసి పేద, మధ్యతరగతి ప్రజలను మోసం చేస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

# ట్రాఫిక్ ఫ్రీ నగరంగా హైదరాబాద్

(మొదటి తరువాయి)

నగరంలో పెరుగుతున్న వాహనాల సంఖ్యతో విపరీతమైన ట్రాఫిక్ జామ్ ఏర్పడుతోంది. ట్రాఫిక్ కష్టాల నుంచి విముక్తి చేయడానికి కనెక్టివిటీ రోడ్ల నిర్మాణానికి ప్రాధాన్య ఇవ్వాలని ఆదేశించారు. ఇప్పటికే గుర్తించిన ప్రాంతాలలో పనులను తక్షణమే ప్రారంభించాలని అధికారులకు సూచించారు. రాష్ట్రంలోని ప్రధాన జిల్లా కేంద్రాలన్నింటికీ ఒక రింగ్ రోడ్డు నిర్మించి, వాటిని జాతీయ రహదారులతో అనుసంధానించాలని సీఎం తెలిపారు. దీని వల్ల జిల్లాల ఆర్థికాభివృద్ధి వేగవంతం అవుతుందని ఆయన ఆకాంక్షించారు. రోడ్ల అభివృద్ధి పనుల్లో భూ సేకరణ వంటి అడ్డంకులు కలగకుండా జిహెచ్ఎంసి, రెవెన్యూ విభాగాల మధ్య పూర్తి సమన్వయం ఉండాలని సీఎం రేవంత్ రెడ్డి సూచించారు. రోడ్ సెక్టార్ పాలసీ-2047 కు అనుగుణంగా రాష్ట్రంలో రోడ్ల అభివృద్ధికి సంబంధించి ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని సమీక్షా సమావేశంలో అధికారులతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. హైదరాబాద్ నగరం నుంచి రాష్ట్రంలో ఎక్కడికైనా నిర్ణీత



సమయంలో చేరుకునేలా రోడ్ల అభివృద్ధి జరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు. హైదరాబాద్ నగరాన్ని ట్రాఫిక్ ఫ్రీ నగరంగా తీర్చిదిద్దడానికి కనెక్టివిటీ రోడ్ల అభివృద్ధికి తీసుకోవాల్సిన చర్యలను గుర్తించాలన్నారు. ఇప్పటికే గుర్తించిన ఏరియాలలో రోడ్ల అభివృద్ధి పనులు మొదలు పెట్టేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని సిఎం అన్నారు. క్షేత్రస్థాయిలో సమస్యలు తలెత్తకుండా స్పష్టమైన కార్యాచరణతో ముందుకు వెళ్లాలని, దీనిపై సాధ్యాసాధ్యాలు నిశితంగా అధ్యయనం చేయాలని సమీక్షా సమావేశంలో అధికారులను ఆదేశించారు. ఇక పేద ప్రజలకు అత్యాధునిక వైద్యం చేరువ చేయడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని ముఖ్యమంత్రి అన్నారు. రాష్ట్రంలో నిర్మాణంలో ఉన్న అన్ని టీచింగ్ హాస్పిటల్స్, పెద్ద ఆసుపత్రుల పనులను సత్వరమే పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ప్రభుత్వ ఆసుపత్రులలో మౌలిక సదుపాయాలను మెరుగు పరిచి, పేదలకు నాణ్యమైన వైద్య సేవలు అందేలా చూడాలని స్పష్టం చేశారు. పేదలకు మరింత మెరుగైన వైద్యసేవలు అందుబాటులోకి తెచ్చేందుకు వీలుగా హాస్పిటల్స్ భవనాల నిర్మాణం వేగంగా పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. ఈ మేరకు సమీక్షలో మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# పశ్చిమాసియా యుద్ధంపై రాజకీయాలా

(మొదటి తరువాయి)

ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ప్రధాని మోదీ మాట్లాడుతూ.. యుద్ధం పేరుతో తనను కాంగ్రెస్ పార్టీ దూషిస్తోందని తెలిపారు. ఇరాన్, ఇజ్రాయెల్ యుద్ధంపై కాంగ్రెస్, వామపక్షాలు తప్పుడు ప్రచారం చేస్తున్నాయని పేర్కొన్నారు. గల్ఫ్‌లో భారతీయులు చిక్కుకోవాలని కాంగ్రెస్ పార్టీ కోరుకుంటుందన్నారు. ఆయా దేశాల్లోని భారతీయులను కాపాడేందుకు కేంద్రం అన్ని ఏర్పాట్లు చేస్తుందని ప్రధాని మోదీ స్పష్టం చేశారు. ఇక ఈ పర్యటనలో పలు ప్రాజెక్టులకు ప్రధాని మోదీ శంకుస్థాపనలు చేశారు. అలాగే వివిధ పథకాలను ఆయన ప్రారంభించారు. ప్రస్తుత సంక్షోభ సమయంలో విదేశాల్లో చిక్కుకున్న భారతీయుల్ని ఇండియాకు తీసుకొస్తామని, ఏ ఒక్కరినీ వదిలిపెట్టేది లేదని ప్రధాని మోదీ అన్నారు. ఒకవైపు ప్రపంచం సంక్షోభంలో ఉంటే కాంగ్రెస్ పార్టీ రాజకీయం చేస్తోందని మోదీ విమర్శించారు. త్వరలో కేరళం అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో మోదీ అక్కడి కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా కీలక

ప్రసంగం చేశారు. విదేశాల్లో చిక్కుకున్న భారతీయుల్ని వదిలిపెట్టబోం. వారిని ఇండియాకు తీసుకొస్తాం. పశ్చిమాసియా సంక్షోభంలో మిగిలిపోయిన భారతీయులకు తగిన సాయం అందిస్తున్నాం. వాళ్ల క్షేమం, సంక్షేమానికి కట్టుబడి ఉన్నాం. గల్ఫ్ కంట్రీస్‌లో ఉన్న భారతీయుల రక్షణ కోసం చర్యలు తీసుకుంటున్న అక్కడి ప్రభుత్వాలకు కృతజ్ఞతలు. మనవారి సేవలు గుర్తించి, తగిన సహాయం అందిస్తున్నాయి అక్కడి ప్రభుత్వాలు. ఆయా దేశాల్లోని భారతీయ రాయబార కార్యాలయాలు కూడా నిరంతరం పని చేస్తున్నాయి. ఒకవైపు ప్రపంచం సంక్షోభంలో ఉంటే కాంగ్రెస్ పార్టీ దీనిపై రాజకీయం చేస్తోంది. రెచ్చగొట్టేలా, బాధ్యతారాహిత్యమైన ప్రకటనలు చేస్తోంది. విదేశాల్లో ఉన్న భారతీయుల విషయంలో రాజకీయం చేయడం తగదన్నారు. ఒకవైపు ప్రభుత్వం నిరంతరం పని చేస్తుంటే ఈ అంశంలో రాజకీయ లబ్ది కోసం కాంగ్రెస్ ప్రయత్నిస్తోంది. డ్రోన్ల తయారీలో దేశ యువత సాధిస్తున్న విజయాల గురించి కాంగ్రెస్ యువరాజు కి అవగాహన లేదు. కేరళ సహా అనేక రాష్ట్రాల్లోని స్టార్టప్‌లు డ్రోన్లు తయారు చేస్తున్నాయి. సంకుచిత మనస్తత్వం గలవారు ఇలాంటి దేశ ప్రగతిని చూడలేరు. బీజేపీ ఆధ్వర్యంలోని ఎన్డీయే కూటమికి కేరళలో ఒక్కసారి అవకాశం ఇవ్వండి. అభివృద్ధి అంటే ఎలా ఉంటుందో చూపిస్తాం. రాష్ట్రం పేరును కేరళ నుంచి కేరళంనకు మార్చినందుకు ఆనందంగా ఉంది. గత ప్రభుత్వాలు కేరళకు ఏమీ చేయలేదని మోదీ అన్నారు.

ఈ పర్యటన అనంతరం తమిళనాడులో ప్రధాని మోదీ పర్యటించనున్నారు. ఈ సందర్భంగా ఆ రాష్ట్రంలో పలు అభివృద్ధి పథకాలకు ఆయన శంకుస్థాపన చేయనుండడంతోపాటు వివిధ పథకాలను ప్రారంభించనున్నారు. ఈ రెండు రాష్టాల్ల్లో ప్రధాని మోదీ పర్యటన సందర్భంగా కట్టుదిట్టమైన భద్రతను ఏర్పాటు చేశారు. మరికొద్ది రోజుల్లో తమిళనాడు, కేరళలతోపాటు అసోం, మేఘాలయా, పుదుచ్చేరి అసెంబ్లీలకు మార్చి నుంచి మే మాసాల మధ్య ఎన్నికల నగారా మోగనుంది. దీంతో ఆయా రాష్టాల్ల్లో అధికారం అందుకోవాలని బీజేపీ, కాంగ్రెస్‌తోపాటు వామపక్ష పార్టీలైన కమ్యూనిస్టు పార్టీ వ్యూహాత్మకంగా అడుగులు వేస్తున్నాయి. ఆ క్రమంలో ప్రధాని మోదీ బుధవారం కేరళ, తమిళనాడుల్లో పర్యటిస్తున్నారు. పలు అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టనున్నారు.

# దుబాయ్ ఎయిర్‌పోర్ట్‌పై ఇరాన్ దాడి..

## -భారతీయుడికి గాయాలు

న్యూఢిల్లీ,

గల్ఫ్ దేశాలపై ఇరాన్ దాడులు కొనసాగుతున్నాయి. ముఖ్యంగా దుబాయ్‌పై వరుసగా దాడులు చేస్తోంది. తాజాగా దుబాయ్ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్ సమీపంలో ఇరాన్ దాడి చేసింది. ఈ ఘటనలో ఒక భారతీయుడు సహా మరో ముగ్గురు గాయపడ్డారు. ఈ విషయంపై దుబాయ్ అధికారులు ప్రకటన చేశారు. దుబాయ్ ఎయిర్‌పోర్ట్ సమీపంలో ఇరాన్ జరిపిన మిస్సైల్ దాడిలో ఒక భారతీయుడు, ఒక బంగ్లాదేశీ, ఇద్దరు ఘనా పౌరులు గాయపడ్డట్లు అధికారులు వెల్లడించారు. వారికి చికిత్స అందిస్తున్నట్లు తెలిపారు. ఒకపక్క ఇరాన్ దాడులు జరుగుతున్నప్పటికీ దుబాయ్ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్ నుంచి విమాన సర్వీసులు కొనసాగుతున్నాయని తెలిపారు.మరోవైపు ఇరాన్ కొత్త సుప్రీం లీడర్ మొజ్తాబా క్షేమంగానే ఉన్నాడని ఆ దేశం ప్రకటించినప్పటికీ ఇజ్రాయెల్ దీన్ని



నమ్మడం లేదు. అతడు స్వల్పంగా గాయపడి ఉంటాడని భావిస్తోంది. తమ దేశం కాల్పుల విరమణ కోరుకోవడం లేదని, తమపై దాడులు చేసిన వారు పర్యవసానాలు ఎదుర్కోవాల్సిందే అని ఇరాన్ ప్రభుత్వం ప్రకటించింది. ఇరాన్ జరుపుతున్న మిస్సైల్ దాడుల్ని తమ డిఫెన్స్ రక్షణ వ్యవస్థ అడ్డుకుంటోందని యూఏఈ అధికారులు అంటున్నారు. బుధవారం పలు ఇరాన్ మిస్సైల్స్‌ను అడ్డుకున్నట్లు వెల్లడించారు. ఇజ్రాయెల్ జరుపుతున్న మిస్సైల్ దాడుల్ని తాము అడ్డుకుంటున్నట్లు ఇరాన్ తెలిపింది. ఇజ్రాయెల్ ప్రయోగించిన అధునాతన హెర్మెస్ 900 మిస్సైల్స్, హెరాన్ టీపీ మిస్సైల్స్‌ను ఇరాన్ డిఫెన్స్ సిస్టమ్ గగనతలంలోనే అడ్డుకున్నట్లు అక్కడి మీడియా తెలిపింది.తాజా పరిస్థితుల నేపథ్యంలో హోర్ముజ్ జలసంధి అలాగే మూసి ఉంటే ప్రపంచ సంక్షోభం తప్పదని ఐక్యరాజ్యసమితి హెచ్చరిస్తోంది. చమురు సరఫరా లేకపోవడం వల్ల ఆహార పదార్థాల ధరలు, జీవన వ్యయం పెరుగుతుందని అభిప్రాయపడింది. ఈ యుద్ధంలో ఇరాన్ పౌరులు 1,300 మందికిపైగా మరణించినట్లు ఆ దేశం ప్రకటించింది.

# మానవ సేవే.. మాధవ సేవ
# కృష్ణ గోపాల్ సేవా సమితి

**● రోజుకు 2000 మందికి భోజనం అందించాలనే లక్ష్యం -- కపిల్ కుమార్ అగర్వాల్**





**ఎల్.బి.నగర్, మార్చి11 (నేటి దర్శిని):**
నిరుపేదలకు సేవ చేయాలనే లక్ష్యంతో కృష్ణ గోపాల్ సేవా సమితి ఆధ్వర్యంలో అల్పాహార కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సుమారు 250 మంది పిల్లలు పాల్గొని ఆనందంగా అల్పాహారం చేశారు. ఈ సందర్భంగా సమితి అధ్యక్షుడు కపిల్ కుమార్ అగర్వాల్ మాట్లాడుతూ, భవిష్యత్తులో తమ సంస్థ ఇతర ప్రాంతాలలో కూడా ఇలాంటి అల్పాహార కార్యక్రమాలను ప్రారంభించనున్నట్లు తెలిపారు. ప్రతిరోజూ సుమారు 1,500 నుండి 2,000 మందికి శుభ్రమైన, రుచికరమైన భోజనం అందించాలనే లక్ష్యంతో సమితి సభ్యులు ముందుకు సాగుతున్నారని పేర్కొన్నారు. అలాగే చింతల్ కుంట వనస్థలిపురం సమీపంలో వేసవి కాలంలో నాలుగు నెలల పాటు ప్రతి మంగళవారం మరియు శనివారం చల్లని మజ్జిగ పంపిణీ కార్యక్రమాన్ని కూడా ప్రారంభించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి సమితి సభ్యులు మరియు సేవాభావంతో సహకరించిన అందరికీ ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

# గాంధీభవన్‌లో గిరిజన ఆదివాసి విస్తృత స్థాయి సమావేశం




**● గిరిజనుల అభివృద్ధికి కాంగ్రెస్ కట్టుబడి ఉంది: పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్**
**● గిరిజన సంక్షేమంపై కీలక చర్చలు -- గాంధీభవన్‌లో కాంగ్రెస్ సమావేశం**


**హైదరాబాద్, మార్చి 11 (నేటి దర్శిని ప్రతినిధి):**
హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో గిరిజన--ఆదివాసి విస్తృత స్థాయి సమావేశం ఎమ్మెల్సీ శంకర్ నాయక్ అధ్యక్షతన ఘనంగా జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, రాష్ట్ర మంత్రివర్యులు సీతక్క హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో నేషనల్ ఆదివాసి గిరిజన చైర్మన్ డాక్టర్ విక్రాంత్ బూర్య, నేషనల్ వైస్ చైర్మన్ బెల్లయ్య నాయక్, ఎమ్మెల్యే మురళి నాయక్, ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్, రాష్ట్ర ఆదివాసి కాంగ్రెస్ వైస్ చైర్మన్ వి.లింగం నాయక్, గడ్డిఅన్నారం మార్కెట్ కమిటీ డైరెక్టర్ మెగావత్ గణేష్ నాయక్ తదితరులు పాల్గొన్నారు. తెలంగాణ రాష్ట్రంలోని వివిధ జిల్లాల చైర్మన్లు, కాంగ్రెస్ పార్టీ నాయకులు మరియు కార్యకర్తలు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. ఈ సందర్భంగా పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ బడుగు బలహీన వర్గాల అభివృద్ధి కోసం కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడూ కట్టుబడి ఉందని తెలిపారు. గిరిజన--ఆదివాసి సమాజానికి రాజకీయంగా మరియు పార్టీ పదవుల్లో ప్రత్యేక ప్రాధాన్యత ఇవ్వడానికి చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టోలో పేర్కొన్న చేవెళ్ల డిక్లరేషన్ అమలుకు కట్టుబడి ఉన్నామని ఆయన స్పష్టం చేశారు. గిరిజనుల అభివృద్ధి కోసం సేవాలాల్ మహారాజ్ కార్పొరేషన్, ఏకలవ్య కార్పొరేషన్, కొమరం భీం కార్పొరేషన్‌లను త్వరలోనే ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. రాష్ట్ర మంత్రివర్యులు సీతక్క మాట్లాడుతూ గిరిజన ప్రాంతాల అభివృద్ధి కోసం నిజామాబాద్, మహబూబ్‌నగర్, నల్లగొండ, ఖమ్మం ప్రాంతాల్లో ఐటిడిఎలను త్వరలోనే ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. గ్రామీణ అభివృద్ధికి ప్రాధాన్యతనిస్తూ కొత్తగా ఎన్నికైన సర్పంచుల ద్వారా గ్రామాల అభివృద్ధి కోసం రూ.2000 కోట్లతో ప్రత్యేక చర్యలు చేపడుతున్నామని పేర్కొన్నారు. ఈ సమావేశం గిరిజన--ఆదివాసి సమాజ అభివృద్ధి మరియు సంక్షేమంపై కీలక చర్చలకు వేదికగా నిలిచింది. కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు భారీ సంఖ్యలో పాల్గొని సమావేశాన్ని విజయవంతం చేశారు. ఈ కార్యక్రమంలో జానకిరామ్ నాయక్, వస్త్రం నాయక్, శంకర్ నాయక్, రమేష్ నాయక్, సీతారాం నాయక్, వివిధ జిల్లాల అధ్యక్షులు, మండల అధ్యక్షులు మరియు కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# రైల్వే జేఏసీ నిరసన దీక్షకు పూర్తి మద్దతు ప్రకటించిన తేజోమయి మాల కుల సంక్షేమ సంఘం

**ఉమ్మడి వరంగల్, మార్చి 11 (నేటి దర్శిని బ్యూరో):**
తెలంగాణ రైల్వే జేఏసీ ఆధ్వర్యంలో ఈ ప్రాంత నిరుద్యోగ యువతి, యువకులకు ఉద్యోగాలు కల్పించాలని చేపడుతున్న నిరసన దీక్ష కు ,తేజోమయి మాల కుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో మద్దతు ప్రకటిస్తూ కరపత్రాన్ని విడుదల చేశారు. వరంగల్ నగరంలోని కాజిపేట్ బాపూజీనగర్ లోని పోచమ్మ గుడి దగ్గర తేజోమయి మాల కుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు మర్యాల కృష్ణ , ప్రధాన కార్యదర్శి బండి విజయ్ కుమార్ ఆధ్వర్యంలో ఈనెల 15 ఆదివారం తెలంగాణ రైల్వే జేఏసీ ఆధ్వర్యంలో కాజీపేట రైల్వే కోచ్ ఫ్యాక్టరీ ముందు ఈ ప్రాంత నిరుద్యోగ యువతీ యువకుల కు ఉద్యోగాలుకల్పించాలని మహా నిరసన దీక్ష చేపడుతున్న సందర్భంగా పూర్తి మద్దతు ప్రకటించినట్లు తెలిపారు . తెలంగాణ రైల్వే జేఏసీ ఈ ప్రాంత నిరుద్యోగుల కోసం చేపడుతున్న మహా నిరసన దీక్ష కు పూర్తి మద్దతునిచ్చి 15వ తేదీ ఆదివారం నిరసన దీక్షలో అందరూ కూర్చుంటామని హామీ ఇవ్వడం జరిగిందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రైల్వే జేఏసీ చైర్మన్ కోండ్ర నర్సింగరావు, కన్వీనర్ దేవులపల్లి రాఘవేందర్, కో కన్వీనర్ పాక వేదప్రకాష్, వైస్ చైర్మన్ వల్లపు తిరుపతి, తేజోమయి మాల కుల సంక్షేమ సంఘం కోశాధికారి పప్పుల గోవర్ధన్, సిహెచ్ కొమ్మాలు, నర్సింగరావు తదితరులు పాల్గొన్నారు.



# గౌడ ప్రజాప్రతినిధుల సన్మానానికి హీరో తల్వార్ సుమన్‌కు ఆహ్వానం




**ఎల్.బి.నగర్, మార్చి11 (నేటి దర్శిని):**
మార్చి 14న మహబూబాబాద్ జిల్లాలో నిర్వహించనున్న గౌడ ప్రజాప్రతినిధుల సన్మాన కార్యక్రమానికి ప్రముఖ సినీ హీరో తల్వార్ సుమన్ గౌడ్‌ను ఆహ్వానించారు. తెలంగాణ గౌడ విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మొల్కపురి శ్రీకాంత్ గౌడ్ హైదరాబాద్‌లో ఆయనను కలసి ఆహ్వాన పత్రికను అందజేశారు. ఈ సందర్భంగా మొల్కపురి శ్రీకాంత్ గౌడ్ మాట్లాడుతూ గౌడ సమాజానికి చెందిన ప్రజాప్రతినిధులను గౌరవిస్తూ మహబూబాబాద్ జిల్లాలో ప్రత్యేకంగా సన్మాన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై గౌడ సమాజానికి ప్రోత్సాహం ఇవ్వాలని హీరో తల్వార్ సుమన్ గౌడ్‌ను కోరారు. కార్యక్రమానికి ఆహ్వానం అందుకున్న తల్వార్ సుమన్ గౌడ్ స్పందిస్తూ గౌడ సమాజ అభివృద్ధికి జరిగే ఇలాంటి కార్యక్రమాలు ఎంతో అవసరమని తెలిపారు. ఈ కార్యక్రమానికి తప్పకుండా హాజరవుతానని ఆయన పేర్కొన్నారు.

# జయరాజు, డా. బండి సత్యనారాయణకు కుసుమ ధర్మన్న జాతీయ విశిష్ట సేవా పురస్కారాలు




**రాజమహేంద్రవరం, మార్చి11 (నేటి దర్శిని):**
తొలి తెలుగు దళిత మహాకవి కుసుమ ధర్మన్న జయంతి సందర్భంగా ప్రతి సంవత్సరం అందించే 'కుసుమ ధర్మన్న జాతీయ విశిష్ట సేవా పురస్కారం' ఈ ఏడాది ప్రజా కవి జి. జయరాజు మరియు ప్రముఖ రచయిత డా. బండి సత్యనారాయణలకు ప్రకటించారు. ఈ విషయాన్ని కుసుమ ధర్మన్న కళాపీఠం చైర్పర్సన్ డా. రాధా కుసుమ ఒక ప్రకటనలో వెల్లడించారు. సాహిత్యం మరియు సామాజిక రంగాల్లో వారు అందించిన విశిష్ట సేవలను గుర్తిస్తూ పురస్కారాల కమిటీ ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. ఈ పురస్కారాలను ఈనెల 17న రాజమహేంద్రవరంలో నిర్వహించే కుసుమ ధర్మన్న జయంతోత్సవ వేడుకల్లో ప్రదానం చేయనున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమానికి మాజీ ఎంపీ హర్ష కుమార్‌తో పాటు పలువురు ప్రముఖులు హాజరుకానున్నట్లు నిర్వాహకులు తెలిపారు. కుసుమ ధర్మన్న కళాపీఠం ఆధ్వర్యంలో ప్రతి సంవత్సరం కుసుమ ధర్మన్న జయంతి సందర్భంగా వివిధ రంగాల్లో విశిష్ట సేవలు అందించిన వ్యక్తులను గుర్తించి ఈ జాతీయ పురస్కారాలను ప్రదానం చేయడం ఆనవాయితీగా కొనసాగుతోంది.

# బైకును లారీ ఢీకొని భార్య మృతి భర్తకు తీవ్ర గాయాలు....!



**ఉమ్మడి వరంగల్, మార్చి 11 ( నేటి దర్శిని బ్యూరో):**
ఉమ్మడి వరంగల్ జిల్లా జనగామ చిలుపూరు మండలం కరుణాపురం దగ్గర జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒక మహిళా మృతి చెందింది. ప్రత్యక్ష సాక్షుల కథనం ప్రకారం దంపతులు హనుమకొండకు బైక్ పై వెళ్తుండగా వెనక నుంచి అతివేగంగా వచ్చిన లారీ బైక్ ను ఢీకొనడంతో అక్కడికక్కడే మహిళ ప్రాణాలు కోల్పోయింది. ఆమె భర్త దాస్ కు తీవ్ర గాయాలు కావడంతో సమాచారం తెలుసుకున్న 108 వాహనం అక్కడికి చేరుకొని క్షతగాత్రులను ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు. సంఘటన స్థలాన్నిపరిశీలించిన పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

# లక్ష్మీ నరసింహ స్వామి ఆలయ హుండీలో నేపాల్ కరెన్సీ....!





**ఉమ్మడి వరంగల్, మార్చి 11 (నేటి దర్శిని బ్యూరో):**
వరంగల్ జిల్లా గీసుకొండ మండలంలోని ప్రసిద్ధ కొమ్మాల శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయ బ్రహ్మోత్సవాలు ఘనంగా ముగిశాయి. ఆలయ అధికారులు హుండీలను లెక్కించడం ప్రారంభించగా, భక్తుల సమర్పించిన కానుకలలో నేపాల్ దేశానికి చెందిన రూపాయలు ఐదు విలువగల కరెన్సీ నోట్లు లభ్యం కావడం భక్తులను ఆశ్చర్య పరిచింది .ఆలయ అర్చకులు ,కమిటీ సభ్యుల సమక్షంలో పారదర్శకంగా హుండీల లెక్కింపు నిర్వహించబడుతుంది.

RNI NO: TGTEL/25/A0471
తెలుగు దిన పత్రిక

# సంపాదకీయం

## నీళ్లు నమిలారు!




పార్లమెంట్ స్పీకర్ ఓం బిర్లాపై ప్రతిపక్షాలు పెట్టిన అవిశ్వాసం మలివిడత బడ్జెట్ సమావేశాల్లో చర్చ జరుగుతోంది. సంఖ్యా బలంగా తీర్మానం నెగ్గే అవకాశం లేకున్నా విపక్షాలు మాత్రం చర్చలో నైతిక విజయం సాధించాయి. స్పీకర్ ఏకపక్ష వైఖరిపై సంధించిన ప్రశ్నలు ప్రజాస్వామ్య విలువల్ని నిలబెట్టాయి. అధికార పక్షాన్ని ఆత్మరక్షణలో పడేశాయి. అంతేకాదు, సభాపతి వ్యవస్థలో ఉండాల్సిన పారదర్శకతను సైతం గుర్తుచేశాయి. రాజ్యాంగం ప్రకారం స్పీకర్ పదవి 'నిష్పక్షపాత న్యాయమూర్తి' వంటిది. ఒకసారి ఆ పీఠం అధిష్టించాక సభాపతికి పార్టీ రంగు ఉండకూడదు. సభ్యులందరినీ సమానంగా చూడాలి, గౌరవించాలి. అధికారపక్షమే కాదు, మైనార్టీలో ఉన్నవారి హక్కులకూ రక్షణగా నిలబడాలి. కానీ, ఆ పదవి ఒక వ్యక్తికో లేదంటే పార్టీకో కొమ్ముకాసే వేదికగా మారితే అది రాజ్యాంగస్ఫూర్తికి తీవ్ర విఘాతం. స్పీకర్ వ్యవహరిస్తున్న తీరు అచ్చం బీజేపీకి ఏజెంట్‌లాగే ఉందన్నది ప్రతిపక్షాల ఆరోపణ. భిన్నాభిప్రాయాలకు అవకాశ మివ్వక పోవడం, ప్రశ్నలను అణగదొక్క డటం, మాట్లాడుతుంటే మైక్ కట్ చేయడం, సభనుంచి సస్పెండ్ చేయడం ప్రజాస్వామ్యాన్ని ఖూనీచేసే చర్యలే తప్ప వేరేకాదు. స్పీకర్ వివక్షపూరితంగా వ్యవహరిస్తున్నారంటూ నూట పద్దెనిమిది మంది విపక్షాల ఎంపీలు తొలివిడత బడ్జెట్ సమావేశాల సందర్భంగా ఆయనపై అవిశ్వాస తీర్మాన నోటీసు అందజేశారు. మంగళవారం జరిగిన చర్చలో ఓం బిర్లా తీరుపై ప్రతిపక్షాలు చర్చను తీవ్రతరం చేయగా పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి కిరణ్‌రిజిజు ఎదురుదాడి మొదలుపెట్టారు. ఇది అసహేతుకం. బాధ్యతల్లో ఉన్నవారు సభ్యులు వేసే ప్రశ్నలను ఓపిగ్గా వినాలి. వాటికి జవాబు చెప్పాలి. అది ప్రజాస్వామ్యం. కానీ, ఇక్కడ మాత్రం స్పీకర్ నిష్పక్షపాతంగానే ఉన్నారని, ప్రతిపక్షాలే సభను అడ్డుకుంటున్నాయని ఆయన వాదించారు. స్పీకర్ నిజంగా చర్చ సవ్యంగా జరిగేలా చూస్తే సభ్యుల ప్రశ్నలకు సమాధానాలు రాబట్టాలి.కానీ, ఎన్డీయే సభ్యులు విద్వేషపూరిత వ్యాఖ్యలు చేస్తున్నా వారించలేదు. పైగా ప్రశ్నించేవారిపై క్రమశిక్షణ చర్యలు తీసుకున్నారు. గత సమావేశాల్లో రికార్డు స్థాయిలో నూట నలభై ఆరు మంది ఎంపీలను ఒకేసారి సస్పెండ్ చేశారు. భారత పార్లమెంట్ చరిత్రలోనే ఇదొక మాయని మచ్చ. ఇదంతా సభలో విపక్షం లేని ఏకపక్షపాలనకు దారితీ యడమే. చర్చ సందర్భంగా విపక్షాలు లేవనెత్తిన మూడు అంశాలు అధికార పక్షాన్ని ఉక్కిరిబిక్కిరి చేశాయి. ప్రజా సమస్యలు, అధికార పార్టీ వ్యహరిస్తున్న తీరుపై లీడర్ ఆఫ్ అపోజిషన్ (రాహుల్‌గాంధీ)కి మాట్లాడే అవకాశం ఎందుకివ్వలేదని విపక్షాలు నిలదీశాయి. మైక్ కట్‌చేయడం పట్ల అభ్యంతరం చెప్పాయి. అయితే దీనిపై ప్రభుత్వం చెప్పిన సమాధానం వింటే ఎవరికైనా నవ్వురాక మానదు.'సాంకేతిక' కారణాల వల్ల మైక్ ఆగిపోయిందట! తప్ప స్పీకర్ కట్ చేయలేదట. ఇంతకన్నా హాస్యాస్పదం మరొకటి ఉండదేమో! మరి గత ఐదేళ్లుగా డిప్యూటీ స్పీకర్ పదవిని ఎందుకు భర్తీ చేయలేదని ప్రశ్నించగా ట్రెజరీ బెంచీలు జవాబు చెప్పలేక నీళ్లు నమిలాయి. ఎందుకంటే రాజ్యాంగంలోని ఆర్టికల్ 93 ప్రకారం స్పీకర్ ఎంపిక జరుగుతుంది. సంప్రదాయంగా డిప్యూటీ స్పీకర్ కూడా ఎంపికవ్వాలి. కానీ, ఇక్కడ ఓం బిర్లా ఏకఛత్రాధిపత్యానికి ఇది అవకాశంగా మారింది. ఇది రాజ్యాంగ వ్యవస్థను అసంపూర్ణంగా ఉంచడమే కాదు, ఉల్లంఘించడం కూడా! మరో అంశం. ప్రశ్నించే గొంతులను సభ బయటకు పంపడం క్రమశిక్షణగా అనుకుంటే, అది పార్లమెంటా లేదంటే బీజేపీ కార్యాలయం అనుకోవాలా? దీనికి కూడా సమాధానం కరువైంది.ఏ చట్టమైనా చేసేటప్పుడు చర్చ జరిగేలా చూడటం, సభ్యులకు ఉన్న అనుమానాలు తొలగించడం సభాపతి బాధ్యత. ఈ ఐదేళ్లుగా చూస్తే ఎక్కువ బిల్లులు ఎటువంటి ముందస్తు చర్చలు లేకుండా నిమిషాల్లోనే ఆమోదం పొందాయి. ఇది పార్లమెంటరీ కమిటీల వ్యవస్థను నిర్వీర్యం చేయడమే. మాట మాట్లాడితే సభను సజావుగా జరగనివ్వాలనే అంశమే ఎక్కువగా అధికారపక్షం నుంచి వినిపించింది. స్పీకర్ స్థానంలో ఉన్నవారు అందరి స్వరాలను వినిపించేలా చూడాలి. ఎప్పుడైతే సభలో ఒకే రకమైన మాట వినపడాలని కోరుకుంటారో అక్కడ చర్చకు తావుండదు, నియంతృత్వమే రాజ్యమేలుతుంది. పార్లమెంట్ అనేది కేవలం బిల్లులు పాస్ చేసే యంత్రం కాదు, ప్రజా ఆకాంక్షల ప్రతిబింబం. ఓటింగ్ ఫలితం ఓం బిర్లాకు అనుకూలంగా ఉండొచ్చు, కానీ సభలో విపక్షాలు లేవనెత్తిన ప్రశ్నల ముందు సర్కార్ తలవంచక తప్పలేదు. మెజార్టీ ఉందన్న అహంకారం రాజ్యాంగం ముందు చెల్లదని అవిశ్వాసం స్పష్టం చేసింది. సంఖ్యాబలం గెలిచినా, రాజ్యాంగ స్ఫూర్తిని గెలిపించడమే నిజమైన ప్రజాస్వామ్యం. ఇప్పటికైనా స్పీకర్ వ్యవస్థ కోల్పోయిన తన వైభవాన్ని, నిష్పక్షపాతాన్ని తిరిగిపొందాలి. అదే భారత పార్లమెంటుకు గౌరవం.

# రాహుల్ గాంధీపై అమిత్ షా ఫైర్

- లోక్‌సభ స్పీకర్‌పై వీగిపోయిన అవిశ్వాస తీర్మానం..

**న్యూఢిల్లీ మార్చి11 (నేటి దర్శిని):** లోక్‌సభలో కాంగ్రెస్ ఆధ్వర్యంలోని ప్రతిపక్షాలు స్పీకర్ ఓంబిర్లాపై ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మానం వీగిపోయింది. బుధవారం సాయంత్రం జరిగిన మూజువాణి ఓటింగ్‌తో అవిశ్వాసం వీగిపోయింది. ఓటింగ్ అనంతరం సభను గురువారానికి వాయిదావేశారు. స్పీకర్ ఓంబిర్లా పక్షపాతంతో వ్యవహరిస్తున్నారని ఆరోపిస్తూ గత నెలలో కాంగ్రెస్ ఆధ్వర్యంలోని ప్రతిపక్షం ఆయనపై అవిశ్వాస తీర్మానాన్ని ప్రవేశపెట్టింది.దీనిపై మంగళవారం, బుధవారం చర్చ జరిగింది. అనంతరం జరిగిన ఓటింగ్‌లో తీర్మానం వీగిపోయింది. తీర్మానానికి కావాల్సిన సభ్యుల సంఖ్యా బలం లేకపోవడంతో



తీర్మానం వీగిపోయింది. ఈ సందర్భంగా జరిగిన చర్చలో కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీపై కేంద్ర హోం మంత్రి అమిత్ షా విమర్శలు చేశారు. 'సభలో ప్రతిపక్ష నేత మాట్లాడటాన్ని ఎవరు డిసైడ్ చేస్తారు. స్పీకరా.. కాదు. మీరే నిర్ణయించుకోవాలి. కానీ, మీకు మాట్లాడే అవకాశం వచ్చినప్పుడు జర్మనీ, ఇంగ్లండ్‌లలో ఉంటారు. 16వ లోక్‌సభలో రాహుల్ గాంధీ హాజరుశాతం 52. సగటున 80 శాతం. 17వ లోక్‌సభలో ఆయన హాజరు శాతం 51. సగటున 66 శాతం. 18వ లోక్‌సభలో కాంగ్రెస్ ఎంపీలు మొత్తం 157.55 గంటలు మాట్లాడారు. అందులో రాహుల్ గాంధీ ఎన్నిగంటలు మాట్లాడారు.ఆయనను ఎవరు ఆపారు..? లోక్‌సభను తక్కువ చేసేందుకు తప్పుడు సమాచారాన్ని ప్రచారం చేస్తున్నారు. రాహుల్ చర్యలు సరైనవి కావు. కాంగ్రెస్ పార్టీలో ఎందరో సీనియర్లు ఉన్నారు. ఈ విషయంలో రాహుల్ గాంధీకి మార్గనిర్దేశకత్వం చేయండి. శశి థరూర్ వంటి వారు ఆయనకు సలహాలివ్వాలి. స్పీకర్‌పై అవిశ్వాస తీర్మానం తీసుకురావడం మామూలు విషయం కాదు. ఇది సరైంది కాదు. స్పీకర్ ఏ ఒక్క పార్టీకి చెందిన వ్యక్తి కాదు. సభను నిష్పాక్షికంగా నడిపే వ్యక్తి" అని అమిత్ షా వ్యాఖ్యానించారు.

# గూగుల్, మైక్రోసాఫ్ట్ వంటి సంస్థలపై దాడి చేస్తాం.

- అమెరికా, ఇజ్రాయెల్‌కు ఇరాన్ హెచ్చరిక

**న్యూఢిల్లీ మార్చి11 (నేటి దర్శిని):** ఇరాన్– ఇజ్రాయెల్, అమెరికా మధ్య యుద్ధం ప్రారంభమై 12వ రోజుకు చేరుకుంది. ఇదే సమయంలో యుద్ధాన్ని మరింత తీవ్రం చేసేందుకు సిద్ధమని ఇరాన్ ప్రకటించింది. ఇకపై అమెరికా, ఇజ్రాయెల్‌కు చెందిన ఆర్థిక సంస్థలు, బ్యాంకులపై దాడులు చేస్తామని ఇరాన్ హెచ్చరించింది. ఈ మేరకు ఇరాన్ మిలిటరీ సెంట్రల్ ఆపరేషనల్ కమాండ్ ఖాటమ్ అల్ అన్బియా ఒక ప్రకటనలో తెలిపారు.ప్రజలు ఈ సంస్తలు, బ్యాంకులకు దూరంగా ఉండాలని ఆయన హెచ్చరించారు. తాజాగా ఇరాన్ రాజధాని టెహ్రాన్‌లోని ఒక కీలక బ్యాంకుపై ఇజ్రాయెల్ అర్ధరాత్రి దాడి చేసింది. ఈ ఘటనలో చాలా మంది సిబ్బంది ప్రాణాలు కోల్పోయారు. దీనిపై ఇరాన్ ఆగ్రహం వ్యక్తం చేసింది. ఇకపై తాము కూడా ఇలాగే అమెరికా, ఇజ్రాయెల్‌లకు చెందిన ఆర్థిక సంస్థలు, బ్యాంకులపై దాడి చేస్తామని, అక్కడి ప్రజలు ఆ




ప్రదేశాలకు దూరంగా ఉండాలని ఇరాన్ హెచ్చరించింది. ఇజ్రాయెల్ తమ బ్యాంకులపై దాడి చేయడం ద్వారా తాము కూడా అలాంటి సంస్థలపై దాడులు చేసేందుకు తగిన కారణాన్ని ఇచ్చిందని ఇరాన్ తెలిపింది. ఈ నేపథ్యంలో ఇజ్రాయెల్ సహా గల్ఫ్ కంట్రీస్‌లోని అమెరికాకు చెందిన సంస్థలపై దాడులు చేసేందుకు ఇరాన్ సిద్ధమవుతోంది. ఈ దాడులకు సంబంధించి అమెరికన్ సంస్థల టార్గెట్ లిస్టును ఇరాన్ ప్రకటించింది.ఇందులో ప్రముఖ అమెరికన్ టెక్ కంపెనీలు, ఇన్‌ఫ్రా కంపెనీలున్నాయి. గూగుల్, మైక్రోసాఫ్ట్, ఐబీఎం, పాలంటీర్, నివిడియా, ఒరాకిల్ వంటి సంస్థలున్నాయి. ఈ సంస్థలు గల్ఫ్ కంట్రీస్‌లో, ఇజ్రాయెల్‌లలో పలు ఆఫీసుల నుంచి తమ కార్యకలాపాలు కొనసాగిస్తున్నాయి. ప్రస్తుతానికి ఇరాన్, ఇజ్రాయెల్ ఒకరిపై ఒకరు చమురు సంస్థలు, ఆర్థిక కేంద్రాలే లక్ష్యంగా దాడులు చేసుకుంటున్నాయి. యుద్ధం కారణంగా హోర్ముజ్ జలసంధి నుంచి చమురు రవాణా నిలిచిపోవడంతో ఇండియా, చైనా వంటి పలు

# అమ్మా.. నేను తిరిగి వస్తానో లేదో తెలియదు'..

- యూఏఈ రెస్క్యూ మిషన్ ముందు తల్లితో యువ పైలట్


**చండీగఢ్ న్యూఢిల్లీ మార్చి11 (నేటి దర్శిని):** అమెరికా– ఇజ్రాయెల్, ఇరాన్ మధ్య యుద్ధం నేపథ్యంలో యువ మహిళా పైలట్ రెస్క్యూ మిషన్‌లో కీలక పాత్ర పోషించింది. యూఏఈలో చిక్కుకున్న 169 మంది భారతీయులను సురక్షితంగా దేశానికి తీసుకువచ్చింది. ఈ రెస్క్యూ మిషన్‌కు ముందు తాను తిరిగి వస్తానో లేదోనని తన తల్లితో ఆమె అన్నది హర్యానాలోని ఫరీదాబాద్‌కు చెందిన 23 ఏళ్ల దీపిక అధానా, ఎయిర్ ఇండియా ఎక్స్‌ప్రెస్‌లో పైలట్. మార్చి 6న ఉదయం 10:15 గంటల సమయంలో రెస్క్యూ ఆపరేషన్‌లో భాగంగా యూఏఈలోని రాస్ అల్ ఖైమాకు వెళ్లాలని అకస్మాత్తుగా ఆమెకు ఆదేశాలు వచ్చాయి. వాస్తవానికి ఆమె సహోద్యోగి ఆ విధులు చేపట్టాల్సి ఉన్నది. ఆ పైలట్ అందుబాటులో లేకపోవడంతో టేకాఫ్‌కు కేవలం రెండు గంటల ముందు ఆ బాధ్యత చేపట్టాలని దీపికకు ఆదేశాలు



అందాయి. విమాన సిబ్బందికి తగిన సూచనలు చేయడంతో పాటు భద్రతకు భరోసా ఇచ్చారు.కాగా, రెస్క్యూ మిషన్‌కు ముందు పైలట్ దీపిక తన తల్లితో మాట్లాడింది. 'అమ్మా.. నేను తిరిగి వస్తానో లేదో తెలియదు. బై బై' అని చెప్పింది. కెప్టెన్ జస్వీందర్ కౌర్, పైలట్ దీపికాతో సహా మరో నలుగురితో కూడిన పూర్తి మహిళా సిబ్బందితో ఆ విమానం టేకాఫ్ అయ్యింది. మార్చి 6న మధ్యాహ్నం 2:00 గంటలకు యూఏఈలోని రాస్ అల్ ఖైమా ఎయిర్‌పోర్ట్‌లో ఎయిర్ ఇండియా విమానం ల్యాండ్ అయింది. విమాన సిబ్బందికి అక్కడ అసాధారణ వాతావరణం కనిపించింది. మరోవైపు గంట తర్వాత 169 మంది భారతీయ ప్రయాణికులు విమానం ఎక్కారు. మధ్యాహ్నం 3:30 గంటలకు ఢిల్లీకి బయలుదేరింది. అయితే యుద్ధ పరిస్థితి నేపథ్యంలో టేకాఫ్ సమయంలో ఎయిర్ ట్రాఫిక్ కంట్రోల్ (ఏటీసీ)తో సంబంధాలు క్లుప్తంగా తెగిపోయాయి. దీంతో ఆ విమాన సిబ్బంది కొంత ఆందోళన చెందారు.అయితే ఆ తర్వాత నెట్‌వర్క్ సాధారణ పరిస్థితికి వచ్చింది. సాయంత్రానికి ఢిల్లీలోని ఇందిరా గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయంలో ఆ విమానం సురక్షితంగా ల్యాండ్ అయింది. యూఏఈలో చిక్కుకున్న తమను సురక్షితంగా భారత్‌కు తీసుకువచ్చినందుకు ప్రయాణికులు ఆ విమాన సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు. యువ పైలట్ దీపిక కూడా క్షేమంగా తిరిగి రావడంతో ఆమె కుటుంబం ఊరట చెందింది.

# హోర్ముజ్ జలసంధి వద్ద 16 ఇరాన్ నౌకలు ధ్వంసం

**వాషింగ్టన్ మార్చి11 (నేటి దర్శిని):** పశ్చిమాసియాలో కొనసాగుతున్న యుద్ధ పరిస్థితుల మధ్య కీలక సముద్ర మార్గమైన హోర్ముజ్ జలసంధి సమీపంలో ఇరాన్ మైనింగ్ కార్యకలాపాలు జరుపుతోందన్న నివేదికల నేపథ్యంలో అమెరికా సైన్యం మంగళవారం 16 ఇరాన్ నౌకలను ధ్వంసం చేసినట్లు ప్రకటించింది. ఈ విషయాన్ని అమెరికా సైన్యానికి చెందిన యునైటెడ్ స్టేట్స్ సెంట్రల్ కమాండ్ సోషల్ మీడియా వేదిక ఎక్స్ లో చేసిన పోస్టులో వెల్లడించింది. హోర్ముజ్ జలసంధి సమీపంలో 16 మైన్ లేయింగ్ నౌకలను సహా పలు ఇరానియన్ నావికా నౌకలను అమెరికా దళాలు



లక్ష్యంగా చేసుకుని ధ్వంసం చేశాయని పేర్కొంది. ఈ ఘటనకు సంబంధించిన వీడియో ఫుటేజ్‌ను కూడా విడుదల చేసింది.అంతకుముందు రోజు అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ మాట్లాడుతూ, అమెరికా దళాలు ఇప్పటికే 10 ఇరాన్ మైనింగ్ నౌకలను ధ్వంసం చేశాయని తెలిపారు. హోర్ముజ్ జలసంధిని లక్ష్యంగా చేసుకునే ఎలాంటి చర్యలైనా తీసుకుంటే ఇరాన్ తీవ్రమైన సైనిక పరిణామాలను ఎదుర్కోవాల్సి వస్తుందని టెహ్రాన్‌కు హెచ్చరించారు. ప్రపంచ చమురు సరఫరాలో దాదాపు ఐదవ వంతు ఈ హోర్ముజ్ జలసంధి గుండా వెళుతుందని విశ్లేషకులు చెబుతున్నారు. ఈ నేపథ్యంలో ఆ ప్రాంతంలో ఉద్రిక్తతలు పెరగడం ప్రపంచ ఇంధన మార్కెట్లపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయి.

## కాళేశ్వరం లో సరస్వతి పుష్కరాలకు 21 కోట్లు మంజూరు




**ఉమ్మడి వరంగల్, మార్చి 11 (నేటి దర్శిని బ్యూరో):**
ఉమ్మడి వరంగల్ జిల్లాలోని కాళేశ్వరంలో మే నెలలో నిర్వహించే సరస్వతి పుష్కరాల కోసం ప్రభుత్వం రూపాయలు 21 కోట్లు మంజూరు చేసింది .భక్తుల సౌకర్యార్థం దేవాదాయశాఖ పంపించిన ప్రతిపాదనలకు ఆమోదం లభించింది. ఈ నిధులతో పురాతన విగ్రహాల ఏర్పాటు, అర్చకులకు వసతులు, ప్రసాద విక్రయ గదులు నిర్మించ నున్నట్లు పేర్కొన్నారు. సరస్వతి ఆలయం వద్ద చిన్నారుల అక్షరాభ్యాసానికి ప్రత్యేకంగా షెడ్లు ఏర్పాటు చేయాలని అధికారులు నిర్వహించారు.

## ఉమ్మడి వరంగల్ జిల్లా రైతులకు 59 డ్రోన్లు మంజూరు....!



**ఉమ్మడి వరంగల్, మార్చి 11 (నేటి దర్శిని బ్యూరో):**
ఉమ్మడి వరంగల్ జిల్లా కు తొలి విడతలో 59 డ్రోన్లు ప్రభుత్వం రైతులకు మంజూరు చేసింది. వ్యవసాయ యాంత్రికరణకు ఉపయోగించేందుకు రైతులకు డ్రోన్లు పంపిణీ చేయుటకు సిద్ధమైంది. ఈ డ్రోన్లు రైతు ఉత్పత్తిదారుల సంఘాలు, సహకార సంఘాలకు ప్రాధాన్యము ఇవ్వనున్నట్లు అధికారులు తెలిపారు. సన్న, చిన్న కారు, మహిళా, ఎస్సీ, ఎస్టీ రైతులకు ప్రాధాన్యం ఉంటుందని పేర్కొ న్నారు. ఒక్కో డ్రోన్ యూనిట్ ధర రూపాయలు 15 లక్షలు ఉంటుందని, ప్రభుత్వము రూపాయల 4 లక్షల మేరకు రాయితీ అందించనున్నట్లు తెలిపారు.

## ఉమ్మడి వరంగల్ జిల్లాకు సోలార్ ప్లాంట్ కు 20.16 కోట్ల సబ్సిడీ....!



**ఉమ్మడి వరంగల్, మార్చి 11 ( నేటి దర్శిని బ్యూరో):**
ఉమ్మడి వరంగల్ జిల్లాకు రూట్ టాప్ సోలార్ ప్లాంట్ ఏర్పాటుకు రూపాయలు 20.16 కోట్ల సబ్సిడీ విడుదలైంది. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రధానమంత్రి సూర్య ఘర్ ముక్త్ ముఫ్ట్ ముఫ్త బిజిలి యోజన పథకం కింద గృహ విద్యుత్ సర్వీసులు 12.73 లక్షలు ఉన్నాయి. రూట్ ఆఫ్ సోలార్ ఏర్పాటు కోసం 9. 058 దరఖాస్తులు వచ్చాయని, వాటిలో 2, 939 ఇళ్లలో 9.95 మెగావాట్ల సామర్థ్యంతో సోలార్ ప్యానల్ ఏర్పాటు చేశారు .అందులో 2, 595 ఇన్స్టాలేషన్లకు రూపాయలు 20.16 కోట్ల సబ్సిడీ మంజూరు చేయడమైనదని, దీని ద్వారా విద్యుత్ వ్యయము తగ్గనుందని పేర్కొన్నారు.

## హమాలి వర్కింగ్ యూనియన్ ఆధ్వర్యంలో ఈ నెల 15న మహా గర్జన



**ఉమ్మడి వరంగల్, మార్చి 11 (నేటి దర్శిని బ్యూరో):**
తెలంగాణ హమాలి వర్కింగ్ యూనియన్ ఆధ్వర్యంలో ఈ నెల 15న వరంగల్ నగరంలోని హగ్రీవ చారి గ్రౌండ్లో హమాలి మహాగర్జనను జయప్రదం చేయాలని రాష్ట్ర అధ్యక్షుడు గుంటి సామ్రాజ్యం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హన్మకొండలోని కాళోజి కళాక్షేత్రం పక్కన నిర్వహించే మహాసభకు రాష్ట్రవ్యాప్తంగా 33 జిల్లాల నుంచి 20వేల మంది హమాలీల హాజరవుతారని తెలిపారు .కార్మికుల హక్కుల సాధన కోసం ఈ గర్జన చేపడుతున్నట్లు పేర్కొన్నారు. అలాగే హమాలీల డిమాండ్లకు సంబంధించిన వాల్ పోస్టర్లను ఆవిష్కరించారు.

# షాద్ నగర్‌లో గ్యాస్ మాఫియా ఆటలు..

- బ్లాక్ మార్కెట్‌తో విలవిలలాడుతున్న హోటల్ వ్యాపారులు!
- గ్యాస్ కొరత పేరిట బ్లాక్ మార్కెట్... కమర్షియల్ సిలిండర్ రూ.5000కి విక్రయం,
- గోడౌన్లలో సిలిండర్ల డంపింగ్... బయట బ్లాక్ మార్కెట్‌లో గ్యాస్ విక్రయాలు!
- అధికారులు ఎక్కడ..? షాద్ నగర్‌లో గ్యాస్ బ్లాక్ మార్కెట్‌తో హోటల్ వ్యాపారులు ఆందోళన






**షాద్ నగర్, మార్చి 11, (నేటి దర్శిని ప్రతినిధి):**
షాద్ నగర్ నియోజకవర్గంలో గ్యాస్ కొరత కారణంగా హోటల్ వ్యాపారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గ్యాస్ అందుబాటులో లేకపోవడంతో కొన్ని హోటళ్లు తాత్కాలికంగా మూతపడుతున్న పరిస్థితి నెలకొంది. తెలంగాణలో గ్యాస్ కొరత ఉందంటూ జరుగుతున్న అసత్య ప్రచారాల కారణంగా గ్యాస్ బుకింగ్ భారీగా పెరిగిందని వ్యాపారులు చెబుతున్నారు. ఈ పరిస్థితిని ఆసరాగా చేసుకుని కొంతమంది గ్యాస్ డీలర్లు సిలిండర్లను ముందుగానే నిలిపివేసి గోడౌన్లలో డంపింగ్ చేస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. దీంతో కమర్షియల్ గ్యాస్ సిలిండర్ ధర బ్లాక్ మార్కెట్‌లో ఐదు వేల రూపాయల వరకు పలుకుతున్నట్లు హోటల్ యజమానులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో అధికారులు, ఎస్ఓటి పోలీసులు వెంటనే స్పందించి బ్లాక్ మార్కెట్‌లో జరుగుతున్న గ్యాస్ వ్యాపారాన్ని అరికట్టి హోటల్ వ్యాపారులను కాపాడాలని హోటల్ యజమానులు డిమాండ్ చేస్తున్నారు.

# కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం నిరుపేదల వైద్య అవసరాలకు అండగా నిలుస్తుంది: ఎమ్మెల్యే

- బాధిత కుటుంబానికి రూ.5,00,000/- ల ఎల్ వో సి కాపీని అందజేసిన ఎమ్మెల్యే

**ఉమ్మడి వరంగల్, మార్చి 11 ( నేటి దర్శిని బ్యూరో):**
ప్రభుత్వం బలహీన వర్గాలకు వైద్య అవసరాల కోసం అన్ని విధాలుగా అండగా నిల్చుతుందని వర్ధన్నపేట ఎమ్మెల్యే కే ఆర్ నాగరాజు అన్నారు.
హన్మకొండ సుబేదారి లోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయం లో హన్మకొండ జిల్లా హసన్పర్తి మండల పరిధిలోని అర్వపల్లి గ్రామానికి చెందిన మంచాల కమల అనారోగ్య సమస్యతో బాధపడుతున్న నేపథ్యంలో చికిత్స కోసం ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి మంజూరైన రూ. 5,00,000/ఐదు లక్షల రూపాయలువిలువైన ఎల్ వో సి కాపీని వర్ధన్నపేట నియోజకవర్గ ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ ఎల్ ఓ సి ద్వారా హైదరాబాద్ నిమ్స్ ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందేందుకు అవసరమైన ఏర్పాట్లు చేసినట్లు ఎమ్మెల్యే తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం నిరుపేదల వైద్య అవసరాల విషయంలో అన్ని విధాలుగా అండగా నిలుస్తుందని,



స్థానిక శాసనసభ్యుడిగా తన దృష్టికి వచ్చే ప్రతి అనారోగ్య సమస్యపై తన వంతు సహాయ సహకారాలు అందించేందుకు కృషి చేస్తానని పేర్కొన్నారు. అలాగే వర్ధన్నపేట నియోజకవర్గ ప్రజలకు ఆయన విజ్ఞప్తి చేస్తూ, లక్షల రూపాయలు ఖర్చయ్యే ప్రైవేట్ ఆసుపత్రుల చికిత్సలకు వెళ్లి అప్పుల పాలుకాకుండా, ప్రభుత్వ నిమ్స్ వంటి ఆసుపత్రుల్లో తాను అందించే ఎల్ ఓ సిల ద్వారా ఉచితంగా మెరుగైన వైద్యం పొందాలని సూచించారు. ఈ సందర్భంగా బాధితురాలు మంచాల కమల కుటుంబ సభ్యులు, ఆపద్కాలంలో అండగా నిలిచిన ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు కి ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలియజేస్తూ తమ కృతజ్ఞతాభావాన్ని వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో హసన్పర్తి మండల పార్టీ అధ్యక్షుడు పోరెడ్డి మహేందర్ రెడ్డి, యూత్ నాయకులు జట్టి యుగేందర్ తో పాటు తదితరులు పాల్గొన్నారు.

# 13వ జాతీయ స్థాయి ఈవి గో-కార్ట్ డిజైన్ ఛాలెంజ్

- ప్రతిభతో రాణించిన గురు నానక్ విద్యాసంస్థల మెకానికల్ ఇంజనీరింగ్ విద్యార్థులు

**ఇబ్రహీంపట్నం ప్రతినిధి,మార్చి11,(నేటి దర్శిని):**
గురు నానక్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (జి ఎన్ ఐ టి)కి చెందిన మెకానికల్ ఇంజనీరింగ్ విద్యార్థులు 13వ జాతీయ స్థాయి ఈవి జి ఓ -కార్ట్ డిజైన్ ఛాలెంజ్ పోటీలలో ఎలక్ట్రిక్ వెహికల్ (ఈవి) విభాగంలో 5వ స్థానాన్ని సాధించి తమ సాంకేతిక నైపుణ్యాన్ని మరోసారి రుజువు చేశారు. తమిళనాడులోని కోయంబత్తూరు లో ఉన్న కారి మోటార్ స్పీడవే లో, ఉత్తరప్రదేశ్‌కు చెందిన ఇస్నీ మోటార్ స్పోర్ట్స్ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించబడ్డాయి. దేశవ్యాప్తంగా సుమారు 80 ప్రముఖ ఇంజనీరింగ్ కళాశాలలు ఈ పోటీలో పాల్గొన్నాయి. విద్యార్థులు రూపొందించిన ఈవి గో-కార్ట్ అత్యాధునిక సాంకేతికతతో రూపొందించబడిన ఈ వాహనంలోని ప్రత్యేకతలు ఇందులో హై-పర్ఫార్మెన్స్ మోటార్ కంట్రోలర్ (6 కె డబ్ల్యూ డిశ్చార్జ్ పవర్)లిథియం-అయాన్ బ్యాటరీ ప్యాక్ (జీఖ-చాఝితీ బి ఎం ఎస్ మోడల్ -- 74వి 55 హెచ్ )అక్యుమ్యులేటర్ సిస్టమ్ (లీఫిక్ 6908) --100 సెల్స్ సమాంతరంగా (32వి, 15 ఎ హెచ్ ) గా ఉన్నాయి.

**ఈ వాహనం ముఖ్య లక్షణాలు:**
గరిష్ట వేగం : సుమారు 100 కిమీ/గంట ఒక్కో ఛార్జ్‌తో ప్రయాణించే దూరం : 90--100 కిమీరీఛార్జ్







సమయం : సుమారు 5 గంటలు,మొత్తం బరువు : 128 కిలోలు ఈ విజయంతో విద్యార్థుల అంకితభావం, సృజనాత్మకత మరియు ఆవిష్కరణాత్మక ఆలోచనలకు గురు నానక్ విద్యాసంస్థలు అందిస్తున్న ప్రోత్సాహం ఎంతో ప్రశంసనీయమని నిర్వాహకులు అభిప్రాయపడ్డారు. ఈ సందర్భంగా గురు నానక్ విద్యాసంస్థల వైస్ చైర్మన్ మరియు గురు నానక్ యూనివర్సిటీ ఛాన్సలర్ అయిన సర్దార్ గగన్ దీప్ సింగ్ కోహ్లీ, విద్యాసంస్థల మేనేజింగ్ డైరెక్టర్ మరియు గురు నానక్ యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ అయినా డా. హెచ్.ఎస్. సైని, విద్యార్థుల సృజనాత్మకతను నూతన ఆవిష్కరణలను అభినందిస్తూ భవిష్యత్తులో ఇలాంటి ఆవిష్కరణలకు తమ తరపున పూర్తి ప్రోత్సాహం ఉంటుందని ఆ దిశగా అధ్యాపకులు కూడా విద్యార్థులను ప్రేరేపించాలని వివరిస్తూ విజేతలకు తమ శుభాకాంక్షలు తెలియచేసారు. డా. బి. వెంకట రమణ రెడ్డి (ప్రిన్సిపాల్), డా. ఎస్.పి. యాదవ్ (డీన్ -- అకడమిక్స్), డా. బి. సంతోష్ కుమార్ (డీన్ -- ఆర్‌డడి), డా. బి. విజయ కుమార్ ( హెచ్ ఓ డి ఐ సి ఓ ఈ ), మరియు డా. పి. వెంకయ్య (ఫ్యాకల్టీ అడ్వైజర్) విద్యార్థులను అభినందించారు. ఈ విజయంతో మెకానికల్ ఇంజనీరింగ్ మరియు ఆటోమోటివ్ డిజైన్ రంగాల్లో జి ఎన్ ఐ టి ప్రతిష్ట మరింత పెరిగిందని, విద్యార్థుల్లో సాంకేతిక నైపుణ్యం, ఆవిష్కరణాత్మక ఆలోచన మరియు ఇంజనీరింగ్ ప్రతిభను అభివృద్ధి చేయడంలో సంస్థ నిరంతరం కృషి చేస్తుందని వారు తెలిపారు.

# నిబంధనకు విరుద్ధంగా మద్యం అమ్మకాలు

- పార్కింగ్ లేకున్నా విచ్చలవిడిగా వాహనాల నిలుపుదల
- మద్యం దుకాణాల ముందు నుండి మహిళలు ఆడపిల్ల నడవాలంటే భయం
- కల్లు కాంపౌండ్ లాగ కనిపిస్తున్న పర్మిట్ రూములు
- నిబంధనలకు విరుద్ధంగా పర్మిట్ రూములలో అనుమతులు
- ఇంత జరుగుతున్న ఎక్సైజ్ శాఖ ఏం చేస్తుంది?
- స్వచ్ఛంద పౌర సేవా సంస్థ నాయకుల ఆగ్రహం




**ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా బ్యూరో, మార్చి11 (నేటి దర్శిని):**
బుధవారం స్థానిక పూలే భవన్లో స్వచ్ఛంద పౌర సేవా సంస్థ ఆధ్వర్యంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సంస్థ అధ్యక్షులు కనుకుంట్ల మల్లయ్య మాట్లాడుతూ మంచిర్యాల జిల్లాతో పాటు, మంచిర్యాల కార్పొరేషన్ లోను మద్యం దుకాణాలు నిబంధనలకు విరుద్ధంగా మద్యం అమ్ముతూ, ప్రజలకు ఇబ్బందుల పాలు చేస్తున్నారని తెలిపారు. మద్యం దుకాణాల ముందు నుండి మహిళలు ఆడపిల్లలు నడిచే ప్రసక్తి లేని విధంగా దుకాణాలు నడుస్తున్నాయని దీనిపై ఎక్సైజ్. పోలీస్ శాఖ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సంస్థ ప్రధాన కార్యదర్శి తులా మధుసూదన్ రావు మాట్లాడుతూ దుకాణాలకు ప్రభుత్వం అనుమతులు ఇచ్చిన పర్మిట్ రూములు కల్లు కాంపౌండ్ లాగా తయారయ్యాయని, బార్లను మించి సదుపాయాలు ఇస్తూ నడుస్తున్నాయని, నిబంధనను అతిక్రమించి దుకాణాలు నడుపుతున్న పర్మిట్ రూములు ఇచ్చిన వైశాల్యం కన్నా ఎక్కువ వైశాల్యంలో నిర్మాణం జరిగినా కూడా, మద్యం షాపులపై ఎక్సైజ్ అధికారులు చర్యలు తీసుకోవడం లేదని అన్నారు. అట్టి పర్మిట్ రూములలో కుర్చీలు టేబుళ్లు ఫ్యాన్లు వేసి మద్యం ప్రియులను ఆకర్షిస్తూ వారికి ఆహారాన్ని కూడా అందించడం చట్ట విరుద్ధం. ఎక్సైజ్ పాలసికి విరుద్ధంగా పర్మిట్ రూములు నడిపించడమే కాకుండా, దుకాణాల ముందు పార్కింగ్ లేకపోవడం వల్ల, దుకాణాల ముందు అడ్డగోలుగా వాహనాలను నిలిపి ప్రజలకు నానా ఇబ్బందులు చేస్తున్నారు. క్రమ పద్ధతిలో పార్కింగ్ చేయాల్సి ఉండగా అట్టు దుకాణదారులు గాని ఇటు ట్రాఫిక్ పోలీసులు, ఎక్సైజ్ శాఖ అధికారులు పట్టించుకోకపోవడం శోచనీయం. కనీసం ట్రాఫిక్ పోలీసులు నిబంధనలు అతిక్రమించిన వాహనాలపై చాలానాలు విధించకపోవడం దుర్మార్గమైన విషయం. ప్రతి దుకాణంలో మూడు సీసీటీవీ కెమెరాలు ఏర్పాటు చేసి వాటిని ఇంటిగ్రేటెడ్ కమాండ్ అండ్ కంట్రోల్ సెంటర్ కి (ICCC) అనుసంధానం చేస్తూ, నిరంతరం వీక్షణ చేయాల్సిన అధికారులు మరి ఇన్ని అవకతవకలు జరుగుతున్నా స్పందించకపోవడం చూస్తే దుకాణదారుల నుండి అధికారులు మామూలు వసూలు చేస్తున్నట్లుగా అర్థమవుతుంది. మద్యం టెండర్లు వాటి నిర్వహణ గురించి, లక్కీ డ్రా లు తీసి దుకాణాలు అప్పజెప్పిన జిల్లా పాలనాధికారి మరి ఈ షాపుల యొక్క నిర్వాకం ప్రజలకు ప్రాణసంకటంగా మారిందని తెలుస్తున్నప్పటికీ జిల్లా కేంద్రంలోనీ కార్పొరేషన్ ప్రాంతంలో ఉన్న మద్యం దుకాణాలపై, అన్ని శాఖలతో కలిసి వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. మద్యం అనేది కేవలం లైసెన్స్ కలిగిన మద్యం దుకాణాలలో మాత్రమే మద్యాన్ని విక్రయించాలి కానీ వాటికి విరుద్ధంగా రాత్రి నుండి తెల్లవారే వరకూ బెల్టు షాపులలో అమ్మడమే కాకుండా, నిరంతరము బస్తీలలో కిరాణా షాపుల్లో కూడా మధ్యము మంచిర్యాల కార్పొరేషన్ లో ఏరులై పారుతుంది తద్వారా మహిళలు తీవ్రమైన మానసిక ఇబ్బందులకు గురికావడమే కాకుండా చాలా కుటుంబాలు రోడ్డున పడుతున్నాయి. అదే కాకుండా శాంతిభద్రతల సమస్యలు కూడా పట్టణంలో జరిగిన సంఘటనలు కోకొల్లలుగా ఉన్నాయి. ఎక్కడో గల్లీలో కాకుండా, మంచిర్యాల ప్రధాన రహదారిలో నిత్యం జిల్లా పాలనాధికారి తో పాటు ఉన్నతాధికారులందరూ తిరిగే రహదారిలో, ఒక మద్యం షాపు పర్మిట్ రూము లేకుండానే మునిసిపల్ రోడ్డుకిరువైపులా లిక్కర్ సేవించే విధంగా ఏర్పాట్లు చేసి యదేచ్ఛగా మద్యం సేవిస్తున్నప్పటికీ ఆబ్కారీ శాఖాధికారులు. పోలీస్ ఉన్నతాధికారులు పట్టించుకోకపోవడం బాధ్యతరాహిత్యంగా భావించాల్సి వస్తుంది. మద్యం విపరీతంగా సేవించి బానిసలు అయినటువంటి వారికి"డి అడిక్షన్ సెంటర్స్" ఏర్పాటు చేయవలసినటువంటి బాధ్యత ఆబ్కారీ శాఖ పై ఉన్నది. ఇదే కాకుండా మద్యపానం

దుష్ప్రభావాల గురించి ప్రజలను చైతన్య పరుస్తూ యువతను రక్షించుకోవాల్సిన బాధ్యత కూడా మద్యపాన శాఖ అధికారులపై ఉన్నది. జిల్లాలో ఏమాత్రం సంబంధిత శాఖ అధికారులు విధానాలకు అనుగుణంగా పని చేయడం లేదు. దుకాణాలు ఏర్పాటు విషయంలో జిల్లా పాలనాధికారి , సంబంధిత ఉన్నతాధికారులు ఏకంగా ఇండస్ట్రియల్ పార్కు భూమిలోనే మద్యం షాపుకు అనుమతి ఇవ్వడం అంటే, జిల్లాలో చట్టం ఏ విధంగా పనిచేస్తుందో దానిని అధికారులు ఏ విధంగా అమలు చేస్తున్నారు అనేది అర్థం అయిపోతుంది. ఇప్పటికైనా జిల్లా పాలనాది కారి మద్యం షాపుల అవినీతి బాగోతాలను గమనించి వాటి ద్వారా ప్రజలకు, ముఖ్యంగా మహిళలకు జరుగుతున్న ఇబ్బందులను గుర్తించి, వెంటనే కఠినమైన చర్యలు మద్యం షాపుల పైన చేపట్టాలని డిమాండ్ చేస్తున్నాం. లేనిచో మహిళలతో కలిసి ఉద్యమాలు తో పాటుగా న్యాయస్థానాలకు కూడా ఆశ్రయిస్తామని హెచ్చరిస్తున్నాం. ఈ సమావేశంలో స్వచ్ఛంద పౌర సేవ సంస్థ అధ్యక్షులు కనుకుంట్ల మల్లయ్య, ప్రధాన కార్యదర్శి తుల మధుసూదన్ రావు, న్యాయవాదులు కర్రె లచ్చన్న, సురేంద్ర చారి, కొట్టే నటేశ్వరరావు, తో పాటు సంస్థ సభ్యులు తాడూరు పోచన్న చారి, లింగన్నపేట విజయ్ కుమార్, దాస్య నాయక్, రాపోలు ప్రభాకర్ రావు, సోమ రాములు, ప్రదీప్, లగిశెట్టి కేశవులు తదితరులు పాల్గొన్నారు.

# రోడ్లు సైడ్ డ్రైనేజీ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే



**ఉమ్మడి వరంగల్, మార్చి 11 (నేటి దర్శిని బ్యూరో):**
కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం ఏర్పడిన నాటి నుంచి అనేక సంక్షేమ, అభివృద్ధి పథకాలను పార్టీలకతీతంగా అర్హులైన పేద ప్రజలకు అందజేయడం జరుగుతుందని వరంగల్ పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి అన్నారు. గ్రేటర్ వరంగల్ 50వ డివిజన్ పరిధిలో రూపాయలు 1.17 కోట్లతో చేపట్టనున్న అంతర్గత రోడ్లు సైడ్ డ్రైనేజీ నిర్మాణ పనులకు ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల్లో ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తున్నామని పేర్కొన్నారు . నియోజకవర్గ అభివృద్ధికి ప్రభుత్వము అధికారులు సహకారంతో కృషి చేయాలని, ప్రజల సమస్యల పరిష్కారానికి అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో నాయకులు ప్రజలు పాల్గొన్నారు

# బదిలీపై వెళ్తున్న సిఐకి సన్మానం..

- మాజీ సర్పంచ్ గుర్రం కేశవులు



**ఆమనగల్, మార్చి11(నేటి దర్శని ప్రతినిధి):**
ఆమనగల్ ఎస్ హెచ్ ఓ గా విధులు నిర్వర్తించి బదిలీపై తలకొండపల్లి ఎస్ హెచ్ ఓ గా వెళ్తున్న జానకి రామ్ రెడ్డిని బుధవారం ఆమనగల్ సర్కిల్ కార్యాలయంలో మాజీ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్, ఆమనగల్ మాజీ సర్పంచ్ గుర్రం కేశవులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయనను శాలువా పూలమాలలతో సత్కరించి అభినందించారు. ఈ సందర్భంగా గుర్రం కేశవులు మాట్లాడుతూ ఉద్యోగులకు బదిలీలు సహజమేనని అన్నారు. 11 నెలలుగా ఆమనగల్లు పోలీస్ స్టేషన్ సర్కిల్ పరిధిలో ప్రజలకు ఎన్నో విశేష సేవలను అందించారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో శ్రీను నాయక్,కాంగ్రెస్ పార్టీ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

# తల్లి-బిడ్డల ఆరోగ్యానికి మరో అడుగు

- ఇబ్రహీంపట్నం బస్ స్టాప్‌లో మదర్ ఫీడింగ్ సెంటర్ ప్రారంభం
- పాలిచ్చే కేంద్రం ప్రారంభించిన ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి



**ఇబ్రహీంపట్నం, మార్చి 11 (నేటి దర్శిని):**
తల్లి--బిడ్డల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని ఇబ్రహీంపట్నం బస్ స్టాప్‌లో ఏర్పాటు చేసిన “మదర్ ఫీడింగ్ సెంటర్” ను శాసనసభ్యులు మల్ రెడ్డి రంగారెడ్డి బుధవారం ప్రారంభించారు. మహిళా సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ కేంద్రం తల్లులకు సౌకర్యవంతమైన వాతావరణంలో శిశువులకు పాలిచ్చే అవకాశం కల్పించనుంది..ఈ సందర్భంగా ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి మాట్లాడుతూ తల్లి--బిడ్డల ఆరోగ్యం అత్యంత ముఖ్యమని, ప్రజలకు అవసరమైన ప్రతి సౌకర్యాన్ని అందించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. ప్రయాణాల్లో ఉన్న తల్లులు తమ చిన్నారులకు సౌకర్యంగా పాలిచ్చేందుకు ఈ కేంద్రం ఎంతో ఉపయోగపడుతుందని తెలిపారు. ప్రజల అవసరాలను దృష్టిలో పెట్టుకుని ఇటువంటి సేవా కార్యక్రమాలను కొనసాగిస్తామని ఆయన పేర్కొన్నారు. తల్లులు మరియు చిన్నపిల్లల కోసం ఈ మదర్ ఫీడింగ్ సెంటర్ ఎంతో అవసరమని, ఇది కేవలం ఒక కేంద్రం మాత్రమే కాకుండా ప్రజల పట్ల చూపించే సేవాభావానికి చిహ్నమని అన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, మహిళా సంక్షేమ శాఖ అధికారులు, ప్రజలు పాల్గొన్నారు.

# తెలంగాణ నూతన గవర్నర్ ప్రమాణ స్వీకార కార్యక్రమం

- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తో తల్లోజు ఆచారి భేటీ...



**ఆమనగల్, మార్చి11(నేటి దర్శిని ప్రతినిధి):**
రాజ్ భవన్ లో నిర్వహించిన తెలంగాణ రాష్ట్ర నూతన గవర్నర్ ప్రమాణ స్వీకార కార్యక్రమానికి రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా మాజీ జాతీయ బీసీ కమిషన్ సభ్యులు తల్లోజు ఆచారి ముఖ్యమంత్రిని ఆత్మీయంగా కలిసి పలకరించారు. ప్రమాణ స్వీకార కార్యక్రమానికి విచ్చేసిన వివిధ ప్రజాప్రతినిధులు, నాయకులతో కలిసి స్నేహపూర్వక వాతావరణంతో పరస్పరం అభివాదాలు తెలియజేసుకున్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర అభివృద్ధి, బీసీ వర్గాల సంక్షేమం, మరియు ప్రజా సమస్యలపై, స్వల్పంగా చర్చించుకున్నట్లు తెలిసింది. ఈ కార్యక్రమం ప్రజా ప్రతినిధులు మరియు విశిష్ట అతిధుల సమక్షంలో ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో శాసన సభాపతి, పిసిసి అధ్యక్షులు, వివిధ శాఖల మంత్రులు, పార్టీ సీనియర్ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా ముగిసిన తీదేడు భవానీ రామలింగేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు




- తులం బంగారం లక్కీడ్రా విజేతగా కలగొని చిన్న మల్లయ్య




**చింతపల్లి, మార్చి 11 (నేటి దర్శిని ప్రతినిధి):**
చింతపల్లి మండల పరిధిలోని తీదేడు గ్రామంలో నిర్వహించిన శ్రీ శ్రీ శ్రీ భవానీ రామలింగేశ్వర స్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు భక్తుల మధ్య ఘనంగా ముగిశాయి. పది రోజుల పాటు వైభవంగా నిర్వహించిన ఈ ఉత్సవాలకు పరిసర గ్రామాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.
బ్రహ్మోత్సవాల సందర్భంగా నిర్వాహకులు వినూత్నంగా “500 కొట్టు -- తులం బంగారం పట్టు” పేరుతో లక్కీ డ్రా నిర్వహించారు. ఈ డ్రాలో 686 నంబర్‌కు చెందిన తీదేడు గ్రామానికి చెందిన కలగొని అంకులమ్మ చిన్న మల్లయ్య విజేతగా నిలిచారు. విజేత చిన్న మల్లయ్య దంపతులను గ్రామ సర్పంచ్ ఉలుపాల స్వప్న శేఖర్ రెడ్డి, ఉపసర్పంచ్ ఇడబోయిన వెంకటయ్య యాదవ్‌లు శాలువాతో సన్మానించి తులం బంగారం అందజేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ ఉలుపాల స్వప్న శేఖర్ రెడ్డి మాట్లాడుతూ బ్రహ్మోత్సవాలను విజయవంతం చేయడంలో సహకరించిన గ్రామ ప్రజలు, నిర్వాహకులు, దాతలకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. శ్రీ భవానీ రామలింగేశ్వర స్వామి ఆశీస్సులతో గ్రామ ప్రజలు సుఖ సంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ ఇడబోయిన వెంకటయ్య యాదవ్, గ్రామ పాలకవర్గ సభ్యులు, గ్రామ పెద్దలు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

# చైతన్యపురి డివిజన్‌లో మౌలిక వసతుల సమస్యలపై ఎమ్మెల్యేకు వినతి పత్రం

● ఎంసిఎచ్, సాయి నగర్ కాలనీల సమస్యలు త్వరలో పరిష్కరిస్తాం: ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి హామీ



**చైతన్యపురి, మార్చి11 (నేటి దర్శిని):** చైతన్యపురి డివిజన్ పరిధిలోని ఎంసిఎచ్ కాలనీ, సాయి నగర్ కాలనీలలో నెలకొన్న రోడ్లు మరియు డ్రైనేజీ సమస్యల పరిష్కారానికి సంబంధించి కాలనీవాసులు బుధవారం ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డిని కలిసి వినతి పత్రం సమర్పించారు. కాలనీల్లోని రోడ్లు దెబ్బతినడం, డ్రైనేజీ వ్యవస్థ సక్రమంగా లేకపోవడం వల్ల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆయన దృష్టికి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి మాట్లాడుతూ కాలనీవాసులు ఎదుర్కొంటున్న సమస్యలను త్వరితగతిన పరిష్కరించే దిశగా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఒకదాని తరువాత ఒకటి సమస్యలను పరిష్కరించేందుకు సంబంధిత అధికారులతో మాట్లాడి అవసరమైన పనులు చేపడతామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో చైతన్యపురి డివిజన్ బిఆర్ఎస్ నాయకులు చంద్రశేఖర్ రెడ్డి, ఎంసిఎచ్ కాలనీ అధ్యక్షులు శ్రీహరి, సాయి నగర్ కాలనీ అధ్యక్షులు లక్ష్మణ చారి, లక్ష్మి, పరందాములు, వేణు తదితరులు పాల్గొన్నారు.

## ఎక్సైజ్ కార్యాలయంలో సజావుగా సాగిన వేలం పాట..



**ఆమనగల్, మార్చి11(నేటి దర్శిని ప్రతినిధి);** ఆమనగల్ పట్టణంలో బుధవారం నాడు స్థానిక ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ కార్యాలయంలో ఎక్సైజ్ సీఐ బద్రీనాథ్ చౌహాన్ వివిధ కేసులలో పట్టుబడ్డ వాహనాలను వేలంపాట నిర్వహించారు. ఆమనగల్ పట్టణంలోని ప్రొహిబిషన్ ఎక్సైజ్ పోలీస్ స్టేషన్ పరిధిలోని ఆమనగల్,కడ్తాల్, మాడుగుల, తలకొండపల్లి , మండలాల పరిధిలోని వివిధ కేసులలో పట్టుబడ్డ రెండు వాహనాలకు హీరో ఫ్యాషన్ ప్రో, టీవీఎస్ ఎక్సెల్, వేలంపాటలో వేలంపాడి ఈ వాహనాలను దక్కించుకున్నారు. ఈ వేలం పాటలో పాల్గొన్నవారు ధరావతు 5000 చెల్లించి వేలంపాటలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఎక్సైజ్ కార్యాలయ సిబ్బంది ప్రజలు, యువకులు, తదితరులు పాల్గొన్నారు.

## 9వ వార్డు సమస్యలను పరిశీలించిన చైర్మన్,కమిషనర్



**ఆమనగల్, మార్చి11(నేటి దర్శిని ప్రతినిధి):** ఆమనగల్లు మున్సిపాలిటీ పరిధిలోని తొమ్మిదవ వార్డు విద్యానగర్ కాలనీలలో నెలకొని ఉన్న సమస్యలను మున్సిపల్ చైర్మన్ పత్యానాయక్ బుధవారం నాడు అడిగి తెలుసుకున్నారు. 9వ వార్డు కౌన్సిలర్ ఎర్రవోలు మహేష్ మున్సిపల్ కమిషనర్ శంకర్ నాయక్ కాలనీవాసులతో కలిసి వీధులన్నీ తిరుగుతూ ఉన్న సమస్యలను ప్రజలను అడిగి తెలుసుకున్నారు. త్రాగునీరు, అండర్ గ్రౌండ్ డ్రైనేజ్, రోడ్లు, వీధిదీపాలు, మొదలైన సమస్యలను త్వరితగతిన పరిష్కరిస్తానని కాలనీవాసులకు చైర్మన్ పత్యా నాయక్ హామీ ఇచ్చారు. కాలనీవాసులు ఆ వార్డులో ఉన్న మరికొన్ని సమస్యలను చైర్మన్ దృష్టికి తీసుకొచ్చి పరిష్కరించాలని కాలనీవాసులు కోరారు. ఈ కార్యక్రమంలో లైన్స్ క్లబ్ పిఆర్ఓ ఎంఏ పాషా, కాలనీవాసులు, తదితరులు పాల్గొన్నారు.

## నూతన గవర్నర్ కి శుభాకాంక్షలు తెలియజేసిన మాజీ జాతీయ బీసి కమిషన్ సభ్యులు ఆచారి




**ఆమనగల్, మార్చి 11, (నేటి దర్శిని ప్రతినిధి):** తెలంగాణ రాష్ట్ర నూతన గవర్నర్ శివ ప్రతాప్ శుక్లాని రాజ్ భవన్‌లో మాజీ జాతీయ బీసీ కమిషన్ సభ్యుడు తల్లోజు ఆచారి మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా పుష్పగుచ్ఛం అందజేసి గవర్నర్ ని అభినందించారు. ఈ కార్యక్రమంలో పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.

## త్రాగునీటి కటకట.. రాయినిగూడెంలో ప్రజల అవస్థలు



**చింతపల్లి, మార్చి 11 (నేటి దర్శిని):** చింతపల్లి మండల పరిధిలోని రాయినిగూడెం గ్రామంలో త్రాగునీటి సమస్య తీవ్రంగా నెలకొంది. గత నాలుగు నుంచి ఐదు రోజులుగా మిషన్ భగీరథ త్రాగునీటి సరఫరా నిలిచిపోవడంతో గ్రామ ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇళ్లకు నీరు అందకపోవడంతో మహిళలు, వృద్ధులు త్రాగునీటి కోసం తంటాలు పడుతున్న పరిస్థితి ఏర్పడింది. మిషన్ భగీరథ ద్వారా సరఫరా కావాల్సిన నీరు అందకపోవడంతో గ్రామస్థులు ప్రైవేట్ వాటర్ ప్లాంట్లను ఆశ్రయించి డబ్బులు ఖర్చు చేసి త్రాగునీటిని కొనుగోలు చేసుకుంటున్నారు. పేద, మధ్యతరగతి కుటుంబాలు ఈ సమస్యతో మరింత ఇబ్బందులు పడుతున్నాయి. గ్రామంలో త్రాగునీటి సమస్యపై సంబంధిత శాఖ అధికారులు స్పందించి మిషన్ భగీరథ నీటిని సరిపడా, సక్రమంగా సరఫరా అయ్యేలా తక్షణ చర్యలు తీసుకోవాలని గ్రామ ప్రజలు కోరుతున్నారు.

## ఎస్.ఆర్. హ్యూమన్ రైట్స్ అండ్ యాంటీ కరప్షన్ అసోసియేషన్ మంచిర్యాల జిల్లా అధ్యక్షులు గా కొండ ప్రవీణ్ కుమార్



**మంచిర్యాల,మార్చి11 (నేటి దర్శిని):** ఎస్ ఆర్ హ్యూమన్ రైట్స్ అండ్ యాంటీ కరప్షన్ అసోసియేషన్ మంచిర్యాల జిల్లా అధ్యక్షులుగా కొండ ప్రవీణ్ కుమార్ ను నియమించడం జరిగింది. ఆంధ్రప్రదేశ్ లోని చీరాల లో అంబేద్కర్ భవన్ లో జరిగిన హ్యూమన్ రైట్స్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో హ్యూమన్ రైట్స్ కు సంబంధించిన విషయాలపై చర్చ వేదిక నిర్వహించారు అనంతరం కొంతమందికి పదోన్నతులు ఇవ్వడం జరిగింది అందులో భాగంగా హ్యూమన్ రైట్స్ మంచిర్యాల జిల్లా అధ్యక్షులుగా కొండ ప్రవీణ్ కుమార్, జిల్లా జనరల్ సెక్రటరీగా పవన్ కళ్యాణ్, కోఆర్డినేటర్ గా శశిధర్ రెడ్డి, వైస్ ప్రెసిడెంట్ గా శ్రీకాంత్, మంచిర్యాల జిల్లా ఉమెన్స్ వింగ్ సెక్రటరీగా మమతను నియమించడం జరిగింది. ఈ సందర్భంగా సంస్థ డైరెక్టర్ జనరల్ సోలమన్ రాజు కు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు . ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సంస్థ మాపై ఉంచిన నమ్మకాన్ని వమ్ము చేసుకోకుండా ప్రజలతో మమేకమై ప్రజా సమస్యలపై అనునిత్యం పోరాడుతూ, ప్రజల పక్షాన ప్రజల కోసం కృషి చేస్తామని తెలియజేశారు.

## రాజ్యసభ సభ్యుడిగా ఎన్నికైన వేం నరేందర్ రెడ్డిని కలిసిన జక్కిడి ప్రభాకర్ రెడ్డి



**హైదరాబాద్, మార్చి 11 (నేటి దర్శిని):** తెలంగాణ రాష్ట్రం తరపున రాజ్యసభ సభ్యుడిగా ఏకగ్రీవంగా ఎన్నికైన ప్రముఖ నేత వేం నరేందర్ రెడ్డిని టిపిసిసి ప్రతినిధి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు శ్రీ జక్కిడి ప్రభాకర్ రెడ్డి నేడు వారి నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయనకు పుష్పగుచ్ఛం అందించి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు. రాజ్యసభ సభ్యుడిగా తెలంగాణ రాష్ట్ర అభివృద్ధికి, ప్రజల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని ఆకాంక్షించారు. వేం నరేందర్ రెడ్డి ఎన్నికతో తెలంగాణ రాష్ట్రానికి మరింత ప్రాతినిధ్యం లభిస్తుందని, ప్రజల ఆశలు నెరవేర్చే విధంగా ఆయన సేవలు అందిస్తారని జక్కిడి ప్రభాకర్ రెడ్డి తెలిపారు.

## సబ్సిడీ మీద వ్యవసాయ యంత్ర పరికరాల పంపిణీ



**నిడమానూరు,మార్చి11 (నేటి దర్శిని):** రైతు సంక్షేమమే ధ్యేయంగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తుందని నిడమనూర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ అంకతి సత్యం తెలియజేశారు మండలంలో రాయితీపై రైతులకు వ్యవసాయ యంత్ర పరికరాలు పంపిణీ చేసి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో నిడమానూరు గ్రామ సర్పంచ్ సలహాదారు,శేషరాజు శ్రీను,అంకతి గిరి,మండల సర్పంచ్ లు,చర్క శ్రీను,,ఉన్నాం చిన వీరయ్య,మేరెడ్డి వెంకట రమణ, నర్సింగ్ విజయ్ కుమార్, ముంగి శివమారయ్య, బైరెడ్డి వెంకట రెడ్డి,జానీ పాషా,మండల వ్యవసాయ అధికారి,ముని క్రిష్ణయ్య, మండల వ్యవసాయ విస్తరణ అధికారులు, బోనోపెర్ కంపెనీ ప్రతినిధులు, ఎండి రఫీ పాల్గొన్నారు.

## వృద్ధాశ్రమానికి రూ.1 లక్ష విరాళం అందజేసిన సేవ భారతి ట్రస్ట్

**వనస్థలిపురం, మార్చి11 (నేటి దర్శిని):** బిజుమళ్ళ మాధవ సూర్యనారాయణ శర్మ సిద్ధాంతి స్మారక సేవ భారతి ట్రస్ట్ 16వ వార్షికోత్సవం సందర్భంగా సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ సమాజానికి ఆదర్శంగా నిలుస్తోంది. ఈ సందర్భంగా నారాయణ సేవ కార్యక్రమం కింద వనస్థలిపురంలోని రెడీ టు సర్వ్ ఫౌండేషన్ వృద్ధాశ్రమానికి రూ. 1,00,000 (ఒక లక్ష) ఆర్థిక సహాయాన్ని అందజేసింది. 2010లో స్థాపించబడిన ఈ ట్రస్ట్ "ధర్మో రక్షతి రక్షితః" (ధర్మాన్ని రక్షించిన వారిని ధర్మం రక్షిస్తుంది) అనే సూత్రాన్ని ఆధారంగా తీసుకుని వివిధ సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ సమాజంలో ప్రత్యేక గుర్తింపు పొందుతోంది. ఈ సందర్భంగా ట్రస్ట్ ప్రతినిధులు మాట్లాడుతూ, ట్రస్ట్ వైదిక విద్యాభివృద్ధి, గోమాత సేవ, ఆర్థికంగా వెనుకబడిన విద్యార్థులకు విద్యా సహాయం, అన్నదానం వంటి కార్యక్రమాలను చేపడుతూ సమాజానికి సేవ చేయడం తమ ప్రధాన లక్ష్యమని తెలిపారు. సమాజం పట్ల కృతజ్ఞతగా మరియు బాధ్యతగా ఈ సహాయాన్ని అందజేస్తున్నామని పేర్కొన్నారు.

రెడీ టు సర్వ్ ఫౌండేషన్ ప్రతినిధులు మాట్లాడుతూ, ట్రస్ట్ అందించిన ఈ విరాళాన్ని వృద్ధాశ్రమంలో నివసిస్తున్న వృద్ధుల అవసరాల కోసం వినియోగిస్తామని తెలిపారు. ఈ సందర్భంగా ట్రస్ట్ సభ్యులకు వారు కృతజ్ఞతలు తెలియజేశారు.

## మేకలు మేపుతుండగా ప్రమాదం... కాలువలో కొట్టుకుపోయిన కాపరి



**నిడమనూరు మార్చి 11 (నేటి దర్శిని):** నిడమనూరు మండలంలో విషాద ఘటన చోటుచేసుకుంది. ఎన్ఎస్పీ ఎడమ కాలువలో జారి పడిన ఓ వ్యక్తి గల్లంతైన సంఘటన బుధవారం చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన గంధం ఎల్లయ్య మేకలను కాస్తూ జీవనం సాగిస్తున్నాడు. బుధవారం (మార్చి 11) ముప్పారం గ్రామ శివారులోని ఎన్ఎస్పీ ఎడమ కాలువ సమీపంలో మేకలను మేపుతున్నాడు. సాయంత్రం సుమారు 4 గంటల సమయంలో కాలువ ఒడ్డున కూర్చుని ఉండగా ప్రమాదవశాత్తు జారి కాలువలో పడిపోయాడు. కాలువలో ప్రవాహం ఎక్కువగా ఉండటంతో ఎల్లయ్య నీటిలో కొట్టుకుపోతుండగా దానబోయిన నాగరాజు గమనించి అతన్ని కాపాడేందుకు ప్రయత్నించాడు. అయితే ప్రవాహం ఉధృతంగా ఉండటంతో ఎల్లయ్య కాలువలో కొట్టుకుపోయి గల్లంతయ్యాడు. ఈ ఘటనపై ఎల్లయ్య భార్య దీవనమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఎల్లయ్య కోసం కాలువలో గాలింపు చర్యలు కొనసాగుతున్నట్లు పోలీసులు తెలిపారు.

## పదవ తరగతి విద్యార్థులకు పరీక్ష ప్యాడ్లు పంపిణీ



**అక్షర వేదం, చెన్నూరు, మార్చి 11** మంచిర్యాల జిల్లా చెన్నూరు నియోజకవర్గంలో ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా పదవ తరగతి పరీక్షలు వ్రాయబోతున్న చెన్నూరు పట్టణంలోని ప్రభుత్వ బాలుర, బాలికల పాఠశాల విద్యార్థులు 130 మందికి చెన్నూర్ పట్టణ పోలీసుల ఆధ్వర్యంలో పరీక్ష ప్యాడ్లు, ఇతర సామాగ్రి పంపిణీ చేసిన కార్మిక మైనింగ్ శాఖ మంత్రి వివేక్ వెంకటస్వామి. డ్రగ్స్ రహిత తెలంగాణాలో భాగంగా పాఠశాల విద్యార్థులకు అవగాహన కల్పించిన పోలీసులు. పరీక్షల్లో బాగా చదివి ఉన్నత మార్కులు సాధించాలని ప్రోత్సహిస్తూ ట్రాన్స్పరెంట్ పరీక్ష ప్యాడ్లు ఇతర సామాగ్రి పంపిణీ చేసిన మంత్రి, కలెక్టర్, పోలీస్ అధికారులు. విద్యార్థులు ఎలాంటి ఒత్తిడికి గురి కాకుండా బాగా చదివి ఉన్నత మార్కులు సాధించాలని పిలుపునిచ్చిన మంత్రి వివేక్ వెంకటస్వామి. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్, జైపూర్ ఏసీపీ వెంకటేశ్వర్లు, చెన్నూరు పట్టణ సీఐ బన్సీలాల్, ఎస్సైలు, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.




# జగపతి బాబు 'వదలా' గ్లింప్స్ విడుదల..

## ఆకట్టుకుంటున్న సస్పెన్స్ థ్రిల్లర్!

జగపతి బాబు, లయ, హృతిక ప్రధాన పాత్రల్లో నటించిన చిత్రం 'వదలా' (ఝుస్త్రుశ్రీు). వైవిధ్యమైన కథాంశంతో రూపొందుతున్న ఈ చిత్రానికి ఆకెళ్ల వి. కృష్ణ దర్శకత్వం వహిస్తున్నారు. సీనియర్ నిర్మాత తమ్మారెడ్డి భరద్వాజ్‌తో పాటు కిశోర్ నాయుడు కలిసి ఈ చిత్రాన్ని అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తుండగా.. త్వరలో ప్రేక్షకుల ముందుకు రానుంది. అయితే తాజాగా చిత్ర బృందం ఈ సినిమాకు సంబంధించిన గ్లింప్స్‌ను విడుదల చేయగా ప్రస్తుతం ప్రేక్షకులను ఆకట్టుకుంటుంది.ఈ గ్లింప్స్ ఆధారంగా పరిశీలిస్తే.. ఇది ఒక వ్యక్తి జీవితం మరియు అతని చుట్టూ అల్లుకున్న రహస్యాల నేపథ్యంలో సాగే గ్రిప్పింగ్ డ్రామా అని స్పష్టమవుతోంది. ముఖ్యంగా జగపతి బాబు నటన, ఆయన పాత్ర తీరుతెన్నులు సినిమాపై అంచనాలను పెంచుతున్నాయి. చాలా కాలం తర్వాత లయ ఈ చిత్రంలో ఒక కీలక పాత్రలో కనిపించబోతుండటం విశేషం. గ్లింప్స్‌లోని విజువల్స్ మరియు నేపథ్య సంగీతం సినిమాలోని తీవ్రతను, ఉత్కంఠను తెలియజేస్తున్నాయి. ఒక విభిన్నమైన పాయింట్‌తో, ఎమోషనల్ అండ్ సస్పెన్స్ ఎలిమెంట్స్‌తో ఈ చిత్రం రూపొందినట్లు తెలుస్తోంది. ప్రస్తుతం నిర్మాణానంతర పనులు జరుపుకుంటున్న ఈ సినిమా విడుదల తేదీని త్వరలోనే అధికారికంగా ప్రకటించనున్నారు.

# క్యూట్ చిట్టి కాస్తా హాట్ బాంబ్‌గా..



'జాతి రత్నాలు' సినిమాతో ఓవర్‌నైట్ స్టార్ అయిపోయిన చిట్టి గుర్తుంది కదా..! అప్పట్లో తన ఇన్నోసెన్స్‌తో ఆకట్టుకున్న ఫరియా అబ్దుల్లా.. ఇప్పుడు నెక్స్ట్ లెవల్ గ్లామర్ షోతో కుర్రాళ్ల మతులు చెడగొడుతోంది. నిన్న మొన్నటి వరకు పద్ధతిగా కనిపించిన ఈ ఆరడుగుల సుందరి.. ఇప్పుడు సడెన్‌గా గేర్ మార్చింది. సోషల్ మీడియాను షేక్ చేస్తున్న ఆమె తాజా ఫోటోషూట్ చూస్తుంటే మతులు చెడిపోవడం కాదు.. మాస్‌గా చెప్పాలంటే జనాలు ఫ్యూజులు ఎగిరిపోతున్నాయి. అసలు ఆ రేంజ్ ఎక్స్‌పోజింగ్ చూసి నెటిజన్లకే కాదు.. ఇండస్ట్రీ వర్గాలకు సైతం మైండ్ బ్లాక్ అవుతోంది. ఫరియా ఇలా సడెన్‌గా రూట్ మార్చడానికి బలమైన కారణమే కనిపిస్తోంది. టాలెంట్ ఎంత ఉన్నా అవకాశాలు రానపుడు ఈ చిట్టి అంతకంటే ఏం చేస్తుంది పాపం..? అచ్చమైన తెలుగమ్మాయి కావడం కూడా ఫరియాకు కలిసి రావడం లేదేమో మరి..?ఎందుకంటే టాలీవుడ్‌లో మన దగ్గర తెలుగమ్మాయిలు స్టార్స్ అయిన సందర్భాలు చాలా తక్కువే. నార్త్ నుంచి వచ్చిన భామలకే మనోళ్లు రెడ్ కార్పెట్ పరుస్తుంటారు. ఫరియా కూడా తన కెరీర్ మొదలైనప్పటి నుంచి చిన్న హీరోలతో అవకాశాలు అందుకుంటుంది కానీ.. బ్రేక్ ఇచ్చి కెరీర్ మార్చేసే అవకాశం మాత్రం ఇప్పటి వరకు రాలేదు. అసలు ఫరియా చేసిన సినిమాలు ఎన్ని..? అని లెక్కలేస్తే.. 2021లో 'జాతిరత్నాలు'తో సూపర్ హిట్ కొట్టాక ఆమెకు ఆ రేంజ్ సక్సెస్ రాలేదు. ఆ తర్వాత 'మోస్ట్ ఎలిజిబుల్ బ్యాచిలర్', 'బంగార్రాజు', 'కల్కి 2898 ూణ' లాంటి సినిమాల్లో చిన్న చిన్న క్యామియోలు, స్పెషల్ సాంగ్స్ చేసింది. ఇక ఫుల్ లెంగ్త్ హీరోయిన్‌గా 'లైక్ షేర్ అండ్ సబ్‌స్క్రైబ్', 'రావణాసుర', 'ఆ ఒక్కటీ అడక్కు' సినిమాలు ఆడలేదు. 'మత్తు వదలరా 2'.. ఆడినా ఆమెకు వర్కవుట్ అవ్వలేదు.





# రవితేజ సినిమాలో కీలకంగా.. తమన్నా

ఓ అరడజను హిందీ సినిమాల్లో ప్రస్తుతం భాగమై ఉన్నది ముంబయ్ సోయగం తమన్నా భాటియా. వీటిలో కీలక పాత్రల్లో నటిస్తున్న సినిమాలు కొన్నుంటే, ప్రత్యేక గీతాల్లో నర్తిస్తున్న సినిమాలు కొన్నున్నాయి. 'పురుషన్' అనే ఓ తమిళ సినిమాలో కూడా ఈ అందాలభామ నటిస్తున్నది. తెలుగులో నటించిన 'దటీజ్ మహాలక్ష్మి' సినిమా విడుదల కావాల్సివుంది. ఇదిలావుంటే.. తాజాగా టాలీవుడ్‌లో తెరకెక్కుతున్న ఓ ప్రస్టేజియస్ సినిమాలో కీ రోల్ పోషించేందుకు తమన్నా ఇటీవలే సైన్ చేసిందట.ఆ సినిమా మరేదోకాదు, రవితేజ కథానాయకుడిగా శివ నిర్వాణ దర్శకత్వంలో రూపొందుతున్న 'ఇరుముడి'. ఇప్పటివరకూ వచ్చిన రవితేజ సినిమాలకు భిన్నంగా, భావోద్వేగాలతో కూడిన ఓ వినూత్న కథాంశంతో రూపొందుతున్న ఈ చిత్రంలో రవితేజకు జోడీగా ప్రియా భవానీ శంకర్ నటిస్తుండగా, కథలోని కీలకమైన ఓ పాత్రకు తమన్నాను దర్శకుడు శివ నిర్వాణ ఎంపిక చేశారట. త్వరలోనే తమన్నా ఈ సినిమా సెట్‌లోకి ఎంట్రీ ఇవ్వనున్నది. దీనికి సంబంధించిన అధికారిక ప్రకటన త్వరలో రానుంది.ప్రతిష్టాత్మక మైత్రీమూవీమేకర్స్ సంస్థ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్న విషయం విదితమే.

# అబ్బో.. ఏం అందంరా బాబు..

## బ్లాక్ డ్రెస్‌లో స్టన్నింగ్ స్టిల్స్!

అందాల చిన్నది, మెగా బ్యూటీ, నిహారిక కొణిదెల గురించి ఎంత చెప్పినా తక్కువే. అందం, అభినయం ఈ బ్యూటీ సొంతం. ఈ చిన్నది తన అంద చందాలతో ఎంతో మంది మదిని దోచుకుంది.మెగా డాటర్‌గా టాలీవుడ్‌లోకి ఎంట్రీ ఇచ్చిన ఈ బ్యూటీ, ఢీ జోడీ డ్యాన్స్ షోలో యాంకరింగ్ చేసి, అందరినీ ఆకట్టుకుంది. తర్వాత ఒక మనసు సినిమాతో హీరోయిన్‌గా ఎంట్రీ ఇచ్చింది. కానీ ఈ మూవీ మాత్రం అంతగా ఆకట్టుకోలేదు. దీంతో సినిమాలకు గుడ్ బై చెప్పింది.ప్రస్తుతం ఈ బ్యూటీ నిర్మాతగా మారి పలు సినిమాలు తెరకెక్కిస్తూ సక్సెస్ అవుతుంది. కమిటి కుర్రవాళ్లు మూవీతో మొదటి సక్సెస్ అందుకుంది.ఇక ఎప్పుడూ సోషల్ మీడియాలో చాలా యాక్టివ్‌గా ఉండే ఈ చిన్నది , ఎప్పటికప్పుడు తన గ్లామర్, లేటెస్ట్ ఫొటోస్ షేర్ చేస్తూ, అభిమానులను ఆకట్టుకుంటుంది.తాజాగా ఈ చిన్నది బ్లాక్ డ్రెస్‌లో ఉన్న స్టన్నింగ్ ఫొటోస్ షేర్ చేసింది. ఇవి నెటిజన్స్‌ను తెగ ఆకట్టుకుంటున్నాయి. ప్రస్తుతం ఈ ఫొటోస్ నెట్టింట తెగ వైరల్ అవుతున్నాయి.

# జునైద్ ఖాన్‌తో సాయిపల్లవి జోడీ

## ఏక్ దిన్ ట్రైలర్ విడుదల




బాలీవుడ్ స్టార్ ఆమిర్ ఖాన్ తనయుడు జునైద్ ఖాన్ మరియు సౌత్ సెన్సేషన్ సాయి పల్లవి జంటగా నటించిన క్రేజీ చిత్రం 'ఏక్ దిన్'. ఈ సినిమా ట్రైలర్‌ను చిత్రబృందంవిడుదల చేసింది. ఈ సినిమాకు సునీల్ పాండే దర్శకత్వం వహిస్తుండగా ఆమిర్ ఖాన్ ప్రొడక్షన్స్ నిర్మిస్తుంది. హీరోయిన్ కేవలం ఒకే ఒక రోజు హీరోతో ప్రేమలో గడపాలనే ఆసక్తికరమైన కథాంశంతో ఈ సినిమా రాబోతుండగా.. ఈ చిత్రం ద్వారా సాయి పల్లవి హిందీ తెరకు పరిచయం కాబోతోంది. రామ్ సంపత్ సంగీతం, అరిజిత్ సింగ్ గాత్రం ఈ సినిమాకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. అన్ని కార్యక్రమాలు పూర్తి చేసుకున్న ఈ చిత్రం మే 1, 2026న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో సందడి చేసేందుకు సిద్ధమవుతోంది.

Published and Owned By Katta Hima Pavani Published at H.No:4-8-301/34SP, Sathya Nagar Colony, Hayath Nagar, Ranga Reddy, Telangana-501505. Printed at Smilys Online 6-7-48, Vanasthalipuram Shopping Complex, Ranga Reddy District, Telangana-500070, Editor: Katta Hima Pavani, PRGI NO: TGTEL/25/A0471, Phone: 94920 33365